

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర

వ్యవస్థాపక సంపాదకులు : సద్గురు శ్రీ నాన్నగారు



సంపుటి : 11 సంచిక : 6 ఫిబ్రవరి 2006

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 28

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి
(హైమ)

చందా
సంవత్సర చందా:రు॥100/-
విడి ప్రతి : రు॥ 5/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

జువ్వలపాలెం ..... 23-11-05
పాతాళమెరక .... 28-11-05
విశాఖపట్నం ..... 13-11-05
తాడినాడ .......... 26-01-06

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, ☎ 08814 - 228858

## అమృతవాహినికి నివేదన

'గురువు' అంటే ఏ సమస్యనైనా పూర్వాపరాలను చర్చించగల సమర్థుడై ఉండాలి. శిష్యులు అడిగే ప్రశ్నలను చక్కగా అర్థం చేసుకొని, బాగా జ్ఞాపకముంచుకొని, వారికి అనుకూలమయిన, యోగ్యమయిన జవాబులివ్వగలగాలి. మన పవిత్రగ్రంథాలు అన్ని మహనీయుల స్వానుభవాలకూ, వారికి గోచరించిన సత్యానికి నిలయాలు. అటువంటి పవిత్ర గ్రంథాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, బాగా ఆకళింపు చేసుకున్న వాడై ఉండాలి. బ్రహ్మజ్ఞానం కలిగి దానితో తాదాత్మ్యం చెందినవాడై ఉండాలి. శిష్యులకు సహాయపడాలనే తపన, వారికి బోధ చేయటం ఒక్కటే లక్ష్యంగా ఉండాలి. ప్రేమ, కరుణ, శాంతం ఆభరణాలుగా ఉండాలి. అహంకారము, కపటము వంటి సామాన్య లోపాలు లేనివాడై ఉండాలి. జ్ఞాన ప్రదాత అయిన దేశకుని వలె కాకుండా ప్రియమిత్రునివలె, కుటుంబంలోని పెద్దవలే తన శిష్యులకు నిజతత్త్వాన్ని బోధించగలగాలి. ఇవన్నీ ఉత్తమ గురువు లక్షణాలు అని వేదం చెప్పుతోంది. అటువంటి ఉత్తమోత్తమ సద్గురువు శ్రీశ్రీశ్రీ జిన్నూరు నాన్నగారు.

నిజ జీవితంలో తారసిల్లే అనుభవాలను ఉదాహరణలుగా చెప్పి, వేదాంత రహస్యాలను సులభగ్రాహ్యములుగా, ఆచరణ యోగ్యములుగా చేయటంలో వారికి వారే సాటి. వారు బోధించే వరకూ, ఎంతటి వారి కయినా ఆ విషయం అంత తర్కబద్ధమైనదిగా తెలియదు. అది నాన్నగారి

బోధలోని ప్రత్యేకత.

మౌనంగా ఆత్మతత్వాన్ని బోధించిన 'మహర్షి' ఎటు తిప్పి, ఎలా ప్రశ్నించినా, 'నేను'ను తెల్సుకోమన్న రమణుడు..... ఆ మౌనం వదిలి మాటలాడటం........? మెదలుపెట్టినట్లుగా!! శ్రీ రమణమహర్షి అవతారం ఆత్మతత్వాన్ని మౌనంగా బోధించటానికి వచ్చింది. కాని అదే రమణుడు జిజ్ఞాసువుల ఆర్తి తీర్చటానికి తత్వాన్ని మాటల్లో విపులీకరించటానికి ఎన్నుకున్న ఉపాధి "శ్రీ నాన్నగారు".

వ్యాస, వాల్మీకి, వసిష్ఠ, అగస్త్యాది మహాఋషులను, శ్రీరమణ, శ్రీ అరవింద, శ్రీ రామకృష్ణ, శ్రీ మలయాళస్వామి, శ్రీ శివానంద వంటి ఆధునిక యోగి పుంగవులను గూర్చి అధ్యయనం చేసిన వారందరికి తప్పక కలిగే భావం తాము జీవించి ఉండగా అటువంటి మహనీయుని, ఆత్మజ్ఞానిని దర్శించే భాగ్యం తప్పక కలగాలని. అలా కోరుకోవటం సాధకుల సంకల్పం. శ్రీ నాన్నగారిని దర్శించి, వారి అనుగ్రహానికి పాత్రులై, వారి ఆశీర్వచనాలు పొందినవారికి అట్టి సంకల్పం నెరవేరినట్లే అనుభూతి కలుగుతుంది. అది తధ్యం.

ఈ అమృత వాహినిని కూర్చి గ్రంధరూపంగా అందించిన అమృతమూర్తి "శ్రీ సాగిరాజు రామకృష్ణంరాజు"గారు ధన్యచరితులు. తాము సద్గురువుల ద్వారా పొందిన జ్ఞానామృతాన్ని తాను మాత్రమే అనుభవించాలి అని అనుకోకుండా సమాజానికంతా ఆ అమృతాన్ని పంచి గురుఋణాన్ని తీర్చుకుని, జీవన్ముక్తులైనారు. శ్రీ నాన్నగారి అమృత సందేశాలను వినని వారికి, ఈ గ్రంథం చదివిన తర్వాత కలిగే అనుభూతి అనిర్వచనీయం.

మానవుడు ఎప్పుడూ భగవత్సమానుడే. ఎప్పటికైనా సరే, ప్రతి మానవుడూ తన నిజతత్వాన్ని తెలిసికొని, ఆత్మ సాక్షాత్కారాన్ని పొందటం తధ్యం. చిత్తశుద్ధితో సరియైన మార్గాన్ని అనుసరిస్తే ఈ జన్మలోనే దానిని సాధించవచ్చు అనే 'ఆత్మ విశ్వాసాన్ని' కలిగించే నాన్నగారి ఉపదేశ సారాంశమే ఈ 'అమృత వాహిని'.

బొప్పన అరుణాదేవి, హైదరాబాదు

# సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 23-11-05, జువ్వలపాలెం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

కార్తీకమాసం లక్ష్మీ ప్రదమైనది, ఈ మాసంలో పార్వతీ పరమేశ్వరులనుగాని, లక్ష్మీ నారాయణులను గాని ఆరాధించటం వలన మన మనస్సులో ఉన్న అలక్ష్మి బయటకు వెళ్ళిపోతుంది, లక్ష్మి మనలను వరిస్తుంది. కొంతమంది అడిగితే ఇస్తారు, అడగకపోతే ఇవ్వరు. ధర్మశాస్త్రంలో ఏమని ఉందంటే మనం వెళ్ళి అడిగితే ఇచ్చేవాడు దాతకాదు, మన అవసరం ఏమిటో తెలుసుకొని మనం అడగకుండానే ఇచ్చేవాడు దాత అని చెప్పారు. అడిగిన తరువాత ఇచ్చేవాడు ధర్మమూర్తి అంటే ధర్మం తెలిసినవాడు. కొంతమందికి అర్హత ఉంటుంది, అడిగినా ఇవ్వరు, వారు అధములు. కొంతమంది మంచి పనులు చేయలేరు, ఎవరైనా మంచి పనులు చేద్దామనుకొన్నా చెయ్యవద్దు అంటూ వచ్చి అడ్డం పడిపోతారు వారు అధమాధములు అని ధర్మశాస్త్రంలో నాలుగు రకాలుగా చెప్పారు. ప్రతీ మనిషికి మూడు దేహాలు ఉంటాయి. రక్తమాంసములతో కూడి ఉన్న దేహాన్ని స్థూలశరీరం అంటారు, మనస్సును సూక్ష్మశరీరం అంటారు, ఇంకా లోపలకు వెళితే యింకో శరీరం ఉంది, దానిని కారణశరీరం అంటారు, కారణశరీరం అంటే అజ్ఞానం. అజ్ఞానాన్ని బట్టి మనస్సు వస్తుంది, అజ్ఞానాన్ని బట్టి దేహం వస్తుంది. ఎంతకాలం అయితే మనలో అజ్ఞానం ఉందో అంతకాలం మనస్సు ఉంటుంది, దేహం ఉంటుంది, పునర్జన్మలు ఉంటాయి, ఇతరలోకాలు ఉంటాయి. దేహయాత్ర కోసం మనం కొన్నిపనులు చేసుకోవాలి. దేహయాత్రకోసం మనపని మనం చేసుకొంటూ ఇంట్లో ఎవరైనా ముసలివారు ఉంటే విసుక్కోకుండా వారికి సేవచేస్తే దేహం శుద్ధి అవుతుంది. యజ్ఞకర్మలు అంటే మీ పనులు మీరు చేసుకొంటూ స్వార్థం లేకుండా సమాజపరంగా పనులు చేస్తూ ఉంటే వాటివలన మీ మనస్సు శుద్ధి అవుతుంది. యజ్ఞకర్మలు చేయటం వలన పూర్వజన్మల నుండి మనకూడా వచ్చిన దోషాలు అన్నీ పోతాయి, జీవలక్షణాలు తగ్గిపోతాయి. మీరు ఏదో కర్మ చేస్తూ యజ్ఞకర్మలు చేస్తున్నాము అని అనుకోకూడదు, మీరు యజ్ఞకర్మలు చేస్తున్నారు అని భగవంతుడు అనుకోవాలి.

మాకు సుఖం లేదు, శాంతిలేదు అని చాలామంది అంటారు. అధికారం ఉన్నవారికి ఇదే పని, అధికారం లేనివారికి ఇదే పని, ధనం ఉన్నవారికి ఇదే పని, ధనం లేనివారికి ఇదే పని. ప్రపంచంలో సుఖం, శాంతి లేదు. ప్రపంచం కుక్క తోక లాంటిది. కుక్కతోక వంకర ఇంతవరకు ఎవడూ తీయలేదు. ఆత్మలోనే సుఖం, శాంతి ఉంది. నాకు సుఖం లేదు, శాంతి లేదు అని ఏ మనస్సు అయితే అంటోందో అది హృదయంలో లయమయితే, అది ఆత్మాకారం చెందితే అప్పుడు

ఎటుచూసినా సుఖమే, ఎటుచూసినా శాంతే. అప్పుడు ఈ లోకంలో ఉండటం వలన మనకేదో లాభం ఉన్నట్లు అనిపించదు, పోవటం వలన నష్టం ఉన్నట్లు అనిపించదు, అటువంటి సమానస్థితికి మనం ఎదిగిరావాలి. మనం యజ్ఞకర్మలు చేస్తూఉంటే మనస్సు శుద్ధి అవుతుంది, కాని లోపల ఉన్న కారణశరీరం పోవటం చాలా కష్టం. కారణశరీరం ఎలా నశిస్తుంది అంటే మనం ప్రీతిగా బ్రహ్మం గురించి శ్రవణం చేయాలి. మనం భగవంతుడు గురించి శ్రవణం చేసి, శ్రవణం చేసి, ఇంటికివెళ్ళి దానిని మననం చేసి, దానిని సొంతం చేసుకొని, దానిని మీరు అనుభవంలోనికి తెచ్చుకొంటే గాని నీకు అజ్ఞానం నశించదు. ప్రపంచవిషయాలమీద ఉన్న శ్రద్ధలో కనీసం వందోవంతు కూడా మీకు భక్తిమీద లేదు. కొంతమంది సినిమాలకు వెళ్ళే బదులు మీటింగులకు వస్తారు, మంచిదే. కొంతమంది యాంత్రికంగా వింటారు. ఇక్కడ ఏమి చెపుతున్నారు, దానిని మనం ఇముడ్చుకోవాలి, చైతన్యానుభవం పొందాలి అనే జిజ్ఞాస రావటం లేదు. ఇతరుల మాట వదిలి వేయండి భక్తులకు కూడా జిజ్ఞాస రావటం లేదు. మనకు శ్రద్ధ లేదు. అయ్యో మనకు శ్రద్ధ లేదు అనుకోవటం లేదు, మనకు శ్రద్ధలేక భగవంతుడు చెప్పినవన్నీ అబద్ధాలు అనుకోవటం. మనం డబ్బు సంపాదించుకొన్నాము, గౌరవం సంపాదించుకొన్నాము కాని వివేకం సంపాదించుకోలేదు అని మనకు తెలియటం లేదు. ఎంతోకొంత కష్టపడకపోతే డబ్బూ రాదు మరి వివేకం మటుకు ఏమీ కష్టపడకుండా వచ్చేస్తుందా? ఏది సత్యం ఏది అసత్యం, దేనిని తెలుసుకోవటం వలన అజ్ఞానంలో నుండి విడుదలపొందుతాము, దేనిని తెలుసుకోవటం వలన శాశ్వతమైన శాంతి అనుభవంలోనికి వస్తుంది, ఏది మనకు మంచి చేస్తుంది ఏది చెడ్డ చేస్తుంది అనే వివేకం, ఆ విభజన మనలో లేదు. ఎంతసేపు ఇవాళ పచ్చగా ఉండి రేపు ఎండిపోయే విషయాల వెంట తిరగటం. అవి ఇవాళ అమృతంలాగ అనిపిస్తాయి, రేపు విషంగా అయిపోతాయి. ఇటువంటి విషయాలు కూడా తెలియని మీకా ఆత్మజ్ఞానం కలిగేది అంటున్నారు.

ఈ ప్రపంచంలో ప్రతీ జీవుడి ముందు రెండు మార్గాలు ఉన్నాయి. శ్రేయోమార్గం, ప్రేయోమార్గం. ఈ ప్రపంచం ఒక్కటే నిజం, మరణానంతర జీవితం లేదు, మన కళ్ళచేత చూడబడేది ఒక్కటే నిజం, మనకు కనిపించనిది ఏదీ లేదు అనుకోవటం, ఇక్కడ అనుభవించే భోగాలే నిజం అనుకొంటూ తాత్కాలిక ప్రయోజనాల కోసం జీవిస్తూ అల్ప సుఖాలకు, స్వల్ప సుఖాలకు బంధింపబడిపోయి జన్మించటం, మరణించటం, మరల జన్మించటం, మరణించటం ఇలా కాలచక్రంలో తిరుగుతూ జీవకోటి వెళ్ళిపోతూ ఉంటుంది, ఇది ప్రేయో మార్గం. ఈ లోకంలో ఉండగానే, ఈ భౌతికశరీరంలో ఉండగానే ప్రేయోమార్గాన్ని విడిచి పెట్టి, తనకు మంచిదికాదు అనుకొన్నది త్యాగం చేసి, భగవదనుభవం పొందటానికి ప్రయత్నం చేసి, ఆనందప్రవాహంలోనికి,

సుఖప్రవాహం లోనికి తీసుకొని వచ్చేది శ్రేయోమార్గం. ఇందులో ఏ మార్గం కావాలో నీవే నిర్ణయించుకో నచికేతా అని యమధర్మరాజు అంటాడు. ఇప్పుడు నీవు అనుభవించే అల్పసుఖాలు, ఈ భోగాలు అన్నీ కూడా వడ్డీతో సహా నీకు దుఃఖాన్ని తీసుకొని వస్తాయి. నీ అలవాట్ల వేగం వలన శ్రేయోమార్గంలో భగవంతుడు చెప్పిన మాటలు మొదట నీకు విషం కింద కనిపించవచ్చు, కానీ అవి చివరకు అమృతంలోనికి తీసుకొని వెళతాయి. బుద్ధిలో తేడాలు ఉండవచ్చు, మనస్సులో తేడాలు ఉండవచ్చు, గుణాల్లో తేడాలు ఉండవచ్చు, రంగుల్లో తేడాలు ఉండవచ్చు కాని ఉన్న వస్తువు ఒక్కటే. రాముడి గుణం వేరుగా ఉండవచ్చు, రావణాసురుడి గుణం వేరుగా ఉండవచ్చు. గుణాల్లో తేడా ఉంది కాని అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడు ఒక్కడే. రాముడికి భిన్నంగా రావణాసురుడు లేడు. రావణాసురుడి హృదయంలో కూడా రాముడు ఉన్నాడు. అయితే రావణాసురుడిని ఎందుకు సంహరించాడు అంటే మన శరీరం మీద ఉన్న కురుపును ఎలా తీసేసుకొంటామో అలాగ రావణాసురుడు సమాజానికి కురుపు కింద తయారయ్యాడు కాబట్టి వాడిని వాడే శిక్షించుకొన్నాడు. సమాజ క్షేమం కోసం రావణాసురుడిని సంహరించాడు కాని అందులో స్వార్థప్రయోజనం ఏమీలేదు, మనలాగ ఏదో కోపం తెచ్చుకొని సంహరించటం కాదు, విరోధం కాదు.

మనకు మంచి కోరికలు వచ్చినా, చెడ్డ కోరికలు వచ్చినా అన్ని కోరికలు అహంకారం నుండే వస్తాయి. మన హృదయంలో ఉన్న సత్యవస్తువు మనకు అనుభవంలోనికి వచ్చేవరకు మనకు కోరిక వస్తుంది, కోపం వస్తుంది, కొత్త శరీరాలు వస్తాయి, జన్మిస్తూ ఉంటాము, మరణిస్తూ ఉంటాము, ఇదేపని మనకు ఇంకోపని లేదు. ఈ ప్రపంచం కొన్ని లక్షల సంవత్సరాలు ఉంటుంది, ఈ కాలప్రవాహంలో మన బతుకు ఎంత, మనం ఎంత, మన ఆస్తి ఎంత, ఇందులో మన జీవితం ఏపాటిది? దేనిని చూసి మనం మురిసిపోవటం, ఇంకో గంటకు ఎలా ఉంటామో మనకు తెలియదు, దేనిని చూసి మురిసిపోవటం, మనం మురిసిపోవటానికంటూ ఏమీ లేదు. ఎవరయినా మురిసిపోతూ ఉంటే అది మన అమాయకత్వానికి గుర్తు, మన అజ్ఞానానికి గుర్తు. ఒకవేళ నిజంగా మన దగ్గర కొంత డబ్బు ఉంటే ప్రపంచంలో ఉన్న సంపదతో పోలిస్తే మన దగ్గర ఉన్న డబ్బు ఏపాటిది. ధర్మ, అర్థ, కామ, మోక్షముల గురించి మన శాస్త్రంలో చెప్పారు. మనం మొదటిది వదిలేసాము, చివరిది వదిలేసాము, మధ్యవి రెండూ పట్టుకొన్నాము. నువ్వు చేసేపని కాని, నువ్వు మాట్లాడే మాటకాని, నీకు వచ్చే ఆలోచన కాని ధర్మవిరుద్ధంగా ఉండకూడదు అని భగవంతుడు చెప్పాడు. తెల్లబట్టలు తీసేసి ఎర్రబట్టలు కట్టుకోవటం సన్యాసం కాదు. అర్థకామాలను ఎవడైతే విడిచిపెట్టాడో వాడే సన్యాసి. ధర్మం అంటే దానం అని కాదు మోక్షానుభవం పొందటానికి

ఎలా జీవించాలో చెప్పేది ధర్మం. అర్థకామాలను విడిచిపెట్టినవాడు, వాడు గృహస్థాశ్రమంలో ఉన్నా తెల్లబట్టలు కట్టుకొన్నా వాడు సన్యాసే. అర్థకామాలను మనస్సులో స్మరించుకొంటూ ఎర్రబట్టలు వేసుకొని తిరిగేవాడు సన్యాసి కాదు. లోకంలో అందరూ ఒకే పని చేయరు. వారి పూర్వజన్మ వాసనను బట్టి వాడు ఏదో పని చేస్తూ ఉంటాడు. ఇందులో ఒకటి ఎక్కువ పని అని, ఒకటి తక్కువ అని ఏమీ లేదు, భగవంతుడికి అందరూ సమానమే. మనం ఈ లోకంలోనికి వచ్చాము కాబట్టి పని దగ్గర బద్ధకించకుండా మనం చేయవలసిన డ్యూటీని శ్రద్ధగా, ప్రేమతో చేస్తూ మన నిజమైన ఇల్లు అయిన మోక్షం దగ్గరకు చేరుకోవాలి. లేకపోతే ఇటువంటి శరీరాలు అనేకం వస్తాయి. మనం సంపాదించినది ఏదీ మరణానంతరం మన కూడా రాదు. వల్లకాటివరకు కొంతమంది బంధువులు, స్నేహితులు వస్తారు, ఈ తుక్కును తీసుకొని వెళ్ళి అక్కడ పాడేస్తారు, కాలిస్తే బూడిద అవుతుంది, కప్పెడితే మట్టి అవుతుంది. మరి తరువాత మాట ఏమిటి? తరువాత నీకూడా ఎవరూ రారు అనుకోకు. నువ్వు చేసిన మంచిపనులు, నువ్వు చేసిన చెడ్డపనులు, నువ్వు మాట్లాడిన మంచి మాటలు, నువ్వు మాట్లాడిన చెడ్డ మాటలు నీకూడా వచ్చేస్తాయి, అవి జీవుడిని అంటి పెట్టుకొని ఉంటాయి.

ఈ దేహమే నేను అనుకొంటూ ఎవడైతే ఈ దేహానికి పరిమితమై ఉంటున్నాడో, ఇదే సర్వస్వం అనుకొంటున్నాడో అది మూలపాపం. ఈ మూలపాపం ఉన్నంతసేపు పాపం చెయ్యకుండా ఉండలేడు. ఇప్పుడు మనందరము ఆత్మభావనలో ఉన్నామా? దేహభావనలో ఉన్నామా? మనం ఆత్మభావనలో లేము, దేహభావనలోనే ఉన్నాము. మనకు ఎంతో కొంత పాపబుద్ధి ఉంది కాబట్టి ఈభావనలో ఉన్నాము, పాపబుద్ధి లేకపోతే దేహానికి పరిమితమై ఉండము. ధుర్యోధనుడికి చాలామంది మంచిమాటలు చెప్పేవారు. మీరందరు మంచి మాటలు చెపుతున్నారు. నేను పొరపాటు చేస్తున్నాను అని నాకు తెలుస్తోంది కాని ఈ బుద్ధి పోవటం లేదు, నా బుద్ధి అలా అలవాటు పడిపోయింది అన్నాడు, అదే మాయ, అది ఈశ్వరుడి లీల. ఈ మాయను ఓవర్‌కమ్ చేస్తేగాని మనం పరమాత్మ యొక్క స్వరూపాన్ని పొందలేము. ఇంట్లో వారి వలన కొంతమంది సుఖపడతారు, కొంతమంది బాధలు పడతారు. ఇదంతా ఈశ్వరుడికి తెలియకుండా జరగటం లేదు. మీకు రోజులు బాగా వెళ్ళిపోయినా అదీ నిజంకాదు, మీకు రోజులు కష్టంగా వెళ్ళినా అదీ నిజం కాదు. ప్రపంచం అంతా కూడా స్వప్నమే. అందుచేత మీరు బేధబుద్ధి పెట్టుకోవద్దు. మనస్సు అనే తెరను చింపేయటానికి ప్రయత్నం చెయ్యండి. లోపలఉన్న వస్తువు మనకు అనుభవంలోనికి రాకుండా మనస్సే మనకు అడ్డు వస్తోంది. మీ డ్యూటీ ఏదో మీరు చక్కగా చేసుకొంటూ, మీ నిజమైనఇంటికి చేరుకొనే ప్రయత్నం మానకండి. మీ నిజమైన

ఇల్లు అంటే మోక్షం. పని చేయండి, ఫలాపేక్ష పెట్టుకోవద్దు. ఇది నా డ్యూటీ, ఇది ధర్మం అనుకొంటూ ఎవడైతే పనిచేస్తున్నాడో వాడికి కర్మఫలం మీద అపేక్ష ఉండదు, ఇది బాగా జ్ఞాపకం పెట్టుకోండి. భగవంతుడు ఈ పని మనకు కేటాయించాడు, ఇది మన కర్తవ్యం అని చెయ్యండి. లోకంలో అందరూ ఒకేపని చెయ్యరు. అందరూ ఒకే పని చేస్తే లోకం నడవదు. నేను ఎవడినో ఉద్ధరిస్తాను అనుకొన్నప్పుడు నువ్వు ఏదో ఒకటి ఆశిస్తావు. రోజూ మీరు మొఖం కడుక్కొంటున్నారు, స్నానం చేస్తున్నారు, ఏదో వస్తుందని ఎదురుచూస్తున్నారా? ఎదురు చూడటం లేదు. రోజూ మీరు చేసుకొనే పని అలా చేయండి, కర్మఫలం మీద కాంక్ష మీకు ఉండనే ఉండదు.

మీ ఇంటి దగ్గర బియ్యం ఉన్నాయి, కూరలు ఉన్నాయి, అన్నీ ఉన్నాయి కాని నిప్పు లేకపోతే వంట అవ్వదు. అలాగే మీకు ఎన్ని అవకాశములు ఉన్నా ఈశ్వరుని దయ లేకుండా మీకు మోక్షం రాదు అంటున్నారు భగవాన్. సత్యం నీ హృదయంలోనే ఉంది. సత్యానికి భిన్నంగా గురువు లేడు. మనందరము ఇప్పుడు అనాత్మ భావనలో ఉన్నాము. అనాత్మ భావన తొందరగా మనిషిని విడిచిపెట్టదు, మనిషిని పీడించేస్తుంది. ఆత్మభావనను ఎవడైతే పెంచుకొంటున్నాడో వాడినే అనాత్మభావన విడిచిపెడుతుంది. ఉన్న వస్తువును ఉన్నట్లుగా ఎవడైతే స్మరించుకొంటున్నాడో, దాని అనుగ్రహం కోసం నిరంతరం పని చేస్తున్నాడో వాడు అనాత్మలోనుండి బయటకు వస్తాడు కాని నిరంతరం ఆత్మ కానిదానిని చింతిస్తూ, ఆత్మ కానిదానికోసం పనులు చేస్తూ ఉన్నవాడు అనాత్మలోనుండి ఎలా బయటకు వస్తాడు. ఈశ్వర భావన ఉన్నవాడు మాత్రమే ప్రకృతిగుణాలలో నుండి బయటకు వస్తాడు. నీకు దేహభావన తగ్గాలంటే ఆత్మభావన పెంచుకోవాలి. నువ్వు కానిదానిలో నుండి విడుదల పొందాలంటే నువ్వు ఏదిగా ఉన్నావో దాని తాలుక గుర్తింపు నీకు రావాలి. దేహభావన ఉన్నంతసేపు ఏదో కోరిక, ఏదో రకమైన భయం వస్తూనే ఉంటుంది. కొంతమందికి పరిస్థితులు అన్నీ బాగానే ఉంటాయి, భయం వేస్తోంది, భయం వేస్తోంది అంటారు. బాహ్యపరిస్థితులు అన్నీ బాగా ఉన్నప్పుడు ఇంక భయం ఎందుకు? యిదంతా నిజం కాదు, నిజం కానిదానిలో నుండి ఇవి అన్నీ వస్తున్నాయి. ఇదే మాయ, ఇదే ఈశ్వరుడి లీల. అందరి హృదయాలలో ఉన్న అంతర్యామే కృష్ణుడు, వాడే ఈశ్వరుడు, వాడు అనేక రకాల వేషాలు వేసుకొని వస్తాడు. మనం పెళ్ళికి పట్టుచీరలు కట్టుకొని వెళతాము, ఇంటిలో మామూలు బట్టలు కట్టుకొంటాము, స్నానానికి వెళ్ళేటప్పుడు తుండుగుడ్డ కట్టుకొంటాము. పట్టుబట్టలు కట్టుకొన్నా, మామూలు బట్టలు కట్టుకొన్నా, తుండుగుడ్డ కట్టుకొన్నా కూడా మనమే. అలాగే భగవంతుడు అనేక రూపాలలో వస్తాడు కాని ఉన్నవస్తువు ఒక్కటే. అందుచేత బేధాలు పెట్టుకోవద్దు, అంతర్యామిగా ఉన్న వాడిని చూడండి, అప్పుడు మీరు తరిస్తారు. కృష్ణుడు రూపం గొప్పది,

రాముడి రూపం తక్కువది అని ఇలా అనుకోకండి. కృష్ణుడు ధర్మాన్ని బోధించాడు, రాముడు ధర్మాన్ని ఆచరించాడు. మామూలుగా మనం జీవితంలో ఎన్ని కష్టాలు పడతామో అన్ని కష్టాలు పడి, వాటిని భరించి చూపించాడు మనకు. అంటే మనకు సహనం నేర్పటం కోసం చేసాడు కాని, ఆ శరీరంలో ఉన్నప్పుడు కూడా ఆయన పరమాత్మ అని ఆ శరీరంతో సంబంధం లేదని ఆయనకి తెలుసు. కాని మనం ఆ శరీరానికి పరిమితమై ఉంటాము. భగవంతుడు చెప్పిన మాటలు అన్నీ మనం బాగుపడటం కోసం, మన నిజమైనఇంటికి మనలను తీసుకొని వెళ్లటం కోసం చెప్పాడు అనే బుద్ధి మనకు రావటం లేదు. రాముడు, కృష్ణుడు అనేక గొప్ప పనులు చేసారు. ఆ పనులు చేసేటప్పుడు మేము గొప్పపనులు చేస్తున్నాము అని వారు అనుకోలేదు. అలా అనుకొంటే వారు కూడా మనలాంటి వారే. అనుకొనేది జీవలక్షణం. పరమాత్మకు అనుకోవటం అంటూ ఏమీ ఉండదు, వారి ద్వారా పనులు అలా జరిగిపోతూ ఉంటాయి. భగవంతుడు చెప్పిన మాటలను అర్థం చేసుకొని, ఆ మాటల ప్రకారం నీవు జీవిస్తూ ఉంటే నీకు సుఖం, శాంతి కలుగుతుంది, మృత్యువులో నుండి అమృతత్వం పొందుతావు. నీకు ఈశ్వరానుగ్రహం కావాలంటే ఆశ కోసం బతకవద్దు, ఆశయం కోసం బతుకు అని గాంధీగారు చెప్పారు. తినటం కోసం బతకవద్దు, బతకటం కోసం తిను. నీవు తినే ఆహారం కూడా అది నీ సొంతం అనుకొని తినవద్దు, ఈశ్వర ప్రసాదం అనుకొని తిను, నీదంటూ ఈ లోకంలో ఏమీ లేదు.

కఠోపనిషత్తులో యమధర్మరాజు నచికేతసుడితో మాట్లాడుతూ నువ్వు చిన్నవాడివి, ఈ వయస్సులో ఆత్మజ్ఞానం నీకు ఎందుకు, శుభ్రంగా పెళ్లి చేసుకో, నీకు రాజ్యాలు ఇస్తాను, అనేక భోగాలు ఇస్తాను, ఏనుగులు ఇస్తాను, అన్నీ ఇస్తాను అంటే ఈ గొడవలు అన్నీ వదిలేసి ఆత్మజ్ఞానం అంటావు ఏమిటి, మరణాన్ని జయించాలి అమృతత్వాన్ని పొందాలి అంటావు ఏమిటి అంటాడు. అప్పుడు నచికేతసుడు ఏమన్నాడు అంటే మీరు ఇవన్నీ నాకు ఇస్తారు అనుకోండి, అవిఅన్నీ నిలబడతాయా అన్నాడు. నేను ఉండగా అవి అయినాపోతాయి, అవి ఉండగా నేను అయినా చనిపోతాను. మీరు చెప్పినవన్నీ నేను కోపంమీద వద్దనటం లేదు. కోపం మీద వద్దని చెపితే మరల రేపు కావాలంటాను. నాకు అమృతత్వం తప్పించి ఏదీ వద్దు అని చెప్పాడు. అప్పుడు యముడు ఏమన్నాడు అంటే నచికేతా నేను ఏమాటలు అయితే చెప్పానో వాటిని అన్నింటిని నీవు జయించావు, ఇప్పుడు నీవు ఆత్మజ్ఞానానికి అర్హుడవు అని చెప్పాడు. ఆకలి బాధ కంటే కఠినమైనది అహంకార బాధ. ఆకలిబాధ అయినా పదిరోజులు పడగలం కాని అహంకారబాధ పడలేము. అహంకారంలో నుండి ఎవడైతే విడుదల పొందాడో వాడు అన్ని

బాధలలో నుండి విడుదల పొందుతాడు. అది ఉంటే అంతా ఉంది, అది లేకపోతే ఏదీలేదు. గాంధీగారు చివరిరోజులలో ఒక మాట చెప్పారు. మీరు ఎవరితో అయినా మాట్లాడేటప్పుడు మీ భావన వారితో చెప్పండి, మీ భావనలో అహంభావన కలపవద్దు. అహంభావన లేకుండా మీ భావన చెప్పండి మీ భావన చెప్పేటప్పుడు అహంభావన అక్కడ ఉందా, అది మీ పతనానికి కారణం అవుతుంది. శివకేశవ బేధం పెట్టుకోవద్దు. ఆ మాయలో పడకండి. లోచూపు నేర్చుకోండి. మీ ఇంటి దగ్గర పనులు ఎంత శ్రద్ధగా చేసుకొంటున్నారో, సమాజపరంగా మీకు ఏమైనా పనులు ఉంటే అవి ఎంత శ్రద్ధగా చక్కబెట్టుకొంటున్నారో భగవంతుడు చెప్పిన మాటల యందు అంత శ్రద్ధ పెట్టుకొని తరించటానికి ప్రయత్నం చేయండి. కలెక్టర్‌గారు ఆఫీసుకు వెళ్తాడు, అక్కడ కూర్చోడు ఇంటికి వచ్చేయాలి. అలాగే మనం కూడా ఈ లోకంలోనికి వచ్చాము, ఎప్పటికయినా మన నిజమైనఇంటికి వెళ్లవలసిందే. మోక్ష సామాగ్రిని సంపాదించుకో, ఆత్మజ్ఞానసముపార్జనకు ప్రయత్నం చెయ్యి. పొందుతావా ఈ జన్మలోనే పొందుతావు, ఒకవేళ ఈ జన్మలో పొందలేవు అనుకో, ఆ ప్రయత్నంలో మరణించావు అనుకో, వచ్చేజన్మలో అయినా ఆత్మజ్ఞానసముపార్జనకు నీకు యోగ్యత కలుగుతుంది. ముసలితనం వచ్చాక అన్ని కాంక్షలు విడిచిపెట్టినా కీర్తికాంక్ష విడిచిపెట్టదు అని మిల్టన్ చెప్పాడు. కొంతమంది ఎలా ఉంటారు అంటే కీర్తి వస్తుందంటేనే పనులు చేస్తారు, కీర్తి రాదు అంటే అది మంచిపని అయినా కూడా చేయరు. చావటానికి సిద్ధంగా ఉన్నవారు కూడా కీర్తికి దాసులే. కీర్తికి దాసరికం చేయటం వలన శాంతిని పోగొట్టుకొంటున్నావు, మోక్షాన్ని పోగొట్టుకొంటున్నావు అని నీకు తెలియటం లేదే అంటాడు ఒక డ్రామాలో మిల్టన్. నువ్వు ఏదైనా మంచి పని చేయాలంటే చేసి వదిలెయ్యి. గౌరవాలను లెక్కించవద్దు. అది మంచి పని అని నీవు అనుకొన్నప్పుడు దాని వలన గౌరవం రాకపోయినా ఆ పని చెయ్యి. మీరు చనిపోయాక మీ వారసులు మీ అస్థికలను తీసుకొని వెళ్లి రాజమండ్రి గోదావరిలో పడేస్తారు. మీ గౌరవాలను, అగౌరవాలను, ఈ తక్కువ ఎక్కువలను, గొప్పలను అన్నింటిని మీరు బతికి ఉండగానే తీసుకొని వెళ్లి రాజమండ్రి గోదావరిలో పడేయమంటున్నారు, అప్పుడు వయ్యా నీకు శాశ్వతమైన శాంతి అంటున్నారు. అసలు జ్ఞానం కలగాలి కాని జ్ఞానం కలిగినవాడు మహాత్ముడే, వాడు మహర్షే. ఎందరో మహానుభావులు కొంతమంది వ్యక్తమవుతారు, కొంతమంది వ్యక్తం కారు. జ్ఞాని ఎక్కడ ఉన్నా వాడు సంసారంలో ఉన్నా, సన్యాసం తీసుకొన్నా, వాడు దేహంలో ఉన్నా, వాడికి దేహం లేకపోయినా జ్ఞానే, జ్ఞానం అంటే జ్ఞానమే. మహాత్ములు, మహర్షులు ఎక్కడ ఉన్నా మనం శిరస్సు వంచవలసిందే, వారికి నమస్కరించవలసిందే ఎందుకు అంటే మన మనస్సు అనే పీడ వదలటానికి చేయాలి.

విష్ణుమూర్తి అనేక అవతారాలలో వచ్చాడు. వామనావతారం చూస్తూ ఉంటే సౌందర్యమే వచ్చి భూమిమీద నడుస్తోందా అనిపిస్తుంది. బలిచక్రవర్తి మంచివాడు, గొప్పదాత. నేను గొప్పవాడిని, నేను చేసిన దానాలు ఎవరూ చేయలేరు అనే అహంకారం పెట్టుకొని పాడైపోతున్నాడు, ఆబుద్ధిని పోగొట్టటానికి వామనావతారంలో వచ్చాడు. బలిచక్రవర్తికి నేను మహాదాతను అనే గర్వం ఉంది. ఆ గర్వాన్ని అణిచివేసి తన స్వరూపాన్ని ఇవ్వటానికి వచ్చిన అవతారమే వామనావతారం. బలిచక్రవర్తిని శిక్షించటానికి రాలేదు, బలిచక్రవర్తిని అనుగ్రహించటానికి వచ్చినదే వామనావతారం. ఏమీ అక్కరలేదు, మీలో ఎవరయినా ఒక్కరు మంచివారు ఉన్నారు అనుకోండి మీ ఒక్కరికోసం, మిమ్మల్ని తరింపచేయటం కోసం భగవంతుడు శరీరం ధరించి వస్తాడు, అంత కరుణామయుడు. ఒక్క ప్రహ్లాదుడికోసం లక్ష్మీనరసింహస్వామి అవతారం వచ్చింది. మీరు ఏదో ఒక అవతారాన్ని ఆశ్రయించి, స్మరించి, తరించండి. చేతిలో డబ్బు లేకుండా బజారులో ఉన్న వస్తువును మనం ఆశించకూడదు అలాగే ధర్మాన్ని ఆచరించకుండా శాంతిని ఆశించకూడదు, జ్ఞానాన్ని ఆశించకూడదు. డబ్బు ఏమీలేనివాడు నేను భోగం అనుభవించాలి అనుకోవటం ఎటువంటిదో ధర్మాచరణ లేకుండా నాకు శాంతి కావాలి, జ్ఞానం కావాలి అనుకోవటం అటువంటిది. శాంతి అనేది ఎక్కడో పై నుంచి వచ్చిపడుతుంది అనుకొంటున్నారు. మన ప్రవర్తన మీద, మన జీవితవిధానం మీద, మన రాగద్వేషాలు తగ్గించుకోవటం మీద శాంతి రావటం ఆధారపడిఉంది అనే అవగాహన మనకు రావటం లేదు. డబ్బు వల్ల, విద్య వల్ల శాంతి రాదు. ధర్మాన్ని ఆచరించటం వలన, మన మనస్సును నియమించుకోవటం వలన, క్రమశిక్షణ వలన శాంతి దొరుకుతుంది. శాంతి అనేది బజారులో దొరికే వస్తువు కాదు. శాంతి మీ హృదయంలోనే ఉంది. అది ఎక్కడ ఉందో అక్కడ వెదకండి మీకు దొరుకుతుంది.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 28-11-05, పాతాళమెరక

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

జ్ఞానం అనేది ఎవరో ఒక వ్యక్తి యొక్క ఆస్తికాదు, జ్ఞానానికి, శాంతికి, ఆనందానికి అందరూ వారసులే. కాని మీరు అనుకోవటాలు వదిలివేయండి. మేం మంచి వాళ్ళం అని, మేం చెడ్డవాళ్ళం అని లేకపోతే మేము గొప్పవారమని, మేము తక్కువవారమని ఇలా అనుకోవటాలు మానివేయండి. ఈ అనుకోవటాలు మానివేస్తే నేను ఈ పుస్తకాన్ని వదిలేస్తే భూమి యొక్క ఆకర్షణశక్తి వలన ఎలా కిందపడిపోతుందో అలాగ, మీరు అనుకోవటాలు మానివేస్తే మీ హృదయంలో ఉన్న వస్తువే మిమ్మల్ని లోపలకు గుంజుకొంటుంది, అప్పడు మీ మనస్సు వెళ్ళి

ఆధ్యాత్మికహృదయంలో లయమవుతుంది అంటే అది మీ అజ్ఞానాన్ని తీసుకొంటోంది, మీకు జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది. మీరు రూపంతోటి, నామంతోటి తాదాత్మ్యం పొందటం వలన మీకు వికారాలు వస్తున్నాయి. కాని మన హృదయంలో ఉన్న సద్వస్తువు అది సహజంగా ఉంటుంది, నిర్వికారంగా ఉంటుంది, నిరాడంబరంగా ఉంటుంది, చాలా సింపుల్‌గా ఉంటుంది. అది ఎంత సింపుల్‌గా ఉందో అలాగ మనం జీవిస్తూ ఉంటే, మన ప్రవర్తన అలాగ ఉంటే ఆ వస్తువు యొక్క అనుగ్రహాన్ని పొందుతాము.

మనం ఏ వస్తువును పొందటానికి యజ్ఞ, యాగాలు చేస్తున్నామో, మనం దేనికోసమైతే జపధ్యానాలు చేస్తున్నామో ఆ వస్తువు మనమై ఉన్నాము. మనలను మనం సంపాదించుకోవటం ఏమిటి? దీనికి రమణాచార్యుడు ఏమిచెప్పారు అంటే ఇందులో మీరు సంపాదించుకొనేది ఏమీ లేదు, పోగొట్టుకొనేదే ఉంది అనేవారు. ఇప్పుడు మీరు కాని దేహంతోటి, మీరుకాని మనస్సుతోటి, మీరు కాని గుణాలతోటి తాదాత్మ్యం పొందుతున్నారు. ఇలా మీరుకాని వస్తువులతో తాదాత్మ్యం వలన మీ స్వరూపానికి దూరమవుతున్నారు. మన స్వరూపానికి మనం దూరమయ్యే కొలది మనకు మిగిలేది అశాంతి, దుఃఖం. మనం ఏదైతే నేను, నేను అంటున్నామో అది మిధ్యానేను, అదే దేహంతో తాదాత్మ్యం పొందుతుంది, అదే ప్రధమతలంపు, అదే మన దుఃఖానికి కారణం. ఈ రాంగ్ ఐ ఉన్నంతసేపు రాంగ్ తింకింగ్ కూడా ఉంటుంది. ఈ దేహగతమైన నేను ఎప్పుడైతే నశించిందో అప్పుడు లోపల ఉన్న సద్వస్తువు నీకు అనుభవంలోనికి వస్తుంది. ఇందులో సంపాదించుకొనేది ఏదీ లేదు, పోగొట్టుకొనేదే ఉంది. సాధన అంటే లోపల ఉన్న వస్తువును సంపాదించుకోవటం కాదు, అది నీకు అనుభవంలోనికి రాకుండా ఏవైతే అడ్డువస్తున్నాయో వాటిని తొలగించుకోవటమే సాధన యొక్క గమ్యం. మీరు యోగులు, ఋషులు అవ్వాలంటే అది డబ్బు పెట్టి బజారులో కొనుక్కొనే వస్తువు కాదు. ఆ వైభవం అంతా మన హృదయంలోనే ఉంది. దానిని పొందటానికి పూర్వం మన మహారాజులు రాజ్యాన్ని కూడా విడిచిపెట్టారు. మనం దేహంతో తాదాత్మ్యం పొందుతున్నాము. అందుచేత దేహం మరణించినప్పుడు నేను మరణిస్తున్నాను అనుకొంటున్నాము. దేహం మరణిస్తున్నా మరణం లేని వస్తువు ఒకటి మన హృదయంలో ఉంది. దేహం మరణించకముందే ఆ వస్తువుతో మనకు తాదాత్మ్యం వస్తే దేహం మరణించినా నేను ఉంటాను అనే అనుభవం నీకు కలుగుతుంది, అప్పుడు నీవు మరణరహితస్థితిని పొందుతావు, అదే మన జీవిత గమ్యం. ఒకవేళ ఆ స్థితిని పొందకుండా బాహ్యంగా నీవు ఏదైనా సాధించినా అది అంతా కూడా స్వప్న మాత్రం. మనమాట ద్వారా, చేతద్వారా, ఆలోచన ద్వారా మిధ్యానేనుకు ఫుడ్ సప్లయి అవ్వకుండా చూసుకోవాలి. అదే సాధన. దేహగతమైన నేనుకు ఫుడ్‌సప్లయి

చేయటం మానివేస్తే కొంతకాలానికి దానంతట అదే సన్నగిల్లి రాలిపోతుంది.

మన సొంతం అంటూ ఏమీ లేదు, ప్రతీది ఈశ్వరుని దయే, మీరు ఏదైనా పొందినా అది అంతా ఈశ్వరుని దయే. నువ్వు తినే అన్నం కూడా నీది కాదు, అదీ ఈశ్వరుని దయే, దానిని ప్రసాదంగా స్వీకరించు. నేను, నాది అనేవి రెండూ తలంపులే. ఇవి గాఢంగా ఉండటం వలన మనం అశాంతికి గురి అవుతున్నాము, మన దుఃఖానికి కారణం ఇవే. మాయ ఎక్కడో ఉంది అని అనుకోవద్దు, ఈ నేను రూపంలోనే ఉంది. నేను భగవంతుడి కంటే వేరుగా ఉన్నాను అనే వేరుభావనను తీసుకొని వచ్చేది కూడా ఇదే. అందులో నుండి నువ్వు విడుదల పొందు. మీకంటే నాలో ఏదో ప్రత్యేకత ఉంది అనుకొంటున్నాను అనుకోండి, అది కూడా నిజం కాదు, అది కూడా ఈ నేను యొక్క కల్పితం, దానిని తొలగించుకో, అదే సాధన. నీకు చదువు ఉండవచ్చు ఆ చదువు నువ్వు కాదు, నీకు ధనం ఉండవచ్చు ఆ ధనం నువ్వు కాదు. ఇలా కానిదానితో తాదాత్మ్యం పొంది నేను గొప్పవాడిని అనుకొంటుంది, ఇది నిజం కాదు. ఈ మిథ్యానేనులో నుండి విడుదల పొందు.

గురువు యొక్క మాట అనుగ్రహం, చూపు అనుగ్రహం, మౌనం అనుగ్రహం, అంతా అనుగ్రహమే. గురువు యొక్క దయ ఇట్టిది అని మనం ఊహించలేము, అది మన మనస్సుకు అందదు. ఈ క్షణంలో నిన్ను మహోన్నతమైన మోక్షసామ్రాజ్యానికి అధిపతిని చేయగలడు. మీతో మాట్లాడుతూ, మీతో కలిసి తిరుగుతూ ఏ మిథ్యానేను అయితే మిమ్మల్ని ఇబ్బంది పెడుతోందో అందులోనుండి మిమ్మల్ని విడుదల చేస్తాడు, సత్యవస్తువును మీకు అనుభవం లోనికి తీసుకొని వస్తాడు. అంటే సాధన చేయించేవాడు, వస్తువును పొందింపచేసేవాడు కూడా ఆయనే. ఇంక మనం అంటూ ఏమీలేదు. ఎప్పుడయినా మనం భగవంతుడిని స్మరించుకొంటున్నాము అంటే అది మన తెలివితేటల వలన కాదు, ఆయన దయ వలననే మనం ఆయనను స్మరించుకొంటున్నాము, ఇది మీరు బాగా గుర్తుపెట్టుకోండి. ఆయనను కాదని మనం చేసేది ఏమీలేదు. నువ్వు ఎవరో నీకు తెలియకుండా నీ బంధువులు కాని, స్నేహితులు గాని, బయట ఏమీ అడ్డు రావటం లేదు, ఈ మిథ్యానేను నీకు అడ్డు వస్తోంది. గురువు అనుగ్రహం లేకుండా ఈ మిథ్యానేనులో నుండి మనం విడుదలపొందలేము. మనం ఈశ్వరుని పాదాలను విడిచిపెట్టకుండా ఉంటే, మనలో ఉన్న బలహీనతలు, అమృతానుభవం పొందకుండా మనలో ఏవైతే ఆటంకాలు ఉన్నాయో అవి అన్నీ కూడా ఆయన అనుగ్రహ ప్రవాహంలో కొట్టుకొని పోతాయి, గురువు యొక్క అనుగ్రహం అత్యంత బలీయమైనది, మనకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, వ్యతిరేకంగా ఉన్నా కూడా ఈశ్వరుని పాదాలయందు భక్తిని విడిచిపెట్టకూడదు. కోట్లాది

రూపాయలు ధనం ఉన్న వారికంటే, ఉన్నతమైన పదవులు అధిష్టించిన వారికంటే ఈశ్వరునిపాదాలయందు భక్తి ఉన్న ఒక చీమ గొప్పది అని గురునానక్ చెప్పారు. భక్తి లేని జీవితం ఎందుకు? అసలు వైభవం అంతా భక్తి లోనే ఉంది. శివ, రామ, కృష్ణా అని మీ నోటితో దైవనామం చెయ్యరు అనుకోండి పుట్టలో ఉన్న పాముకి మీ నోటిలో ఉన్న నాలుకకు తేడా ఏముంది అని ఒక కవి అన్నాడు.

తెరమీద ఏదైనా బొమ్మ ఉంది అనుకోండి, తెర ఆ బొమ్మకే పరిమితమై లేదు, ఆ బొమ్మకు ఆధారంగా ఉంది, ఆ బొమ్మలేని చోట కూడా తెర ఉంది. అలాగే ఈశ్వరుడు అంతటా ఉన్నాడు. అందులో ఏదో ఒక భాగంలో ఈ సృష్టి మనకు కనిపిస్తోంది. ప్రపంచం అనేది మంచిది కాదు, చెడ్డది కాదు, ఇది ఒక ట్రైనింగ్ గ్రౌండ్ అంతే అన్నారు భగవాన్. ఈ ప్రపంచం మంచిది అని కొంతమంది, చెడ్డది అని కొంతమంది అనుకొంటున్నారు. ఈ ప్రపంచం ఇలా ఉంది అని కొంతమంది, అలా ఉంది అని కొంతమంది అనుకొంటున్నారు. ప్రపంచం గురించి నువ్వు కల్పించుకొన్న గొడవలు అన్నీ వదిలెయ్యి, నీ మనస్సు వెళ్ళి గూటిలో పడిపోతుంది, నువ్వు సుఖంగా, శాంతిగా ఉంటావు. ఈ లోకానికి ఒక యజమాని ఉన్నాడు, ఈ లోకం గొడవ ఆయన చూసుకొంటాడు. ఈ లోకం గురించి నీవు ఏదో ఊహించుకోవద్దు, కల్పించుకోవద్దు, నువ్వు క్వయిట్‌గా ఉండు అనుకొనేది జీవసంకల్పం, జరిగేది ఈశ్వరసంకల్పం. అందుచేత ఎవడైతే ఈశ్వరసంకల్పాన్ని పరిపూర్ణంగా గౌరవిస్తున్నాడో ఎవడైతే ఈశ్వరసంకల్పాన్ని హృదయపూర్వకంగా అంగీకరిస్తున్నాడో వాడి మనస్సు అణుగుతుంది, వాడికి ఆత్మజ్ఞానం కలుగుతుంది. ఈ సృష్టిలో ఏది జరిగినా భగవాన్ ఎప్పుడూ ఆశ్చర్యం వ్యక్తపరచలేదు. అలా జరగవలసి ఉంది, జరిగింది అంతే అనేవారు. మనం లోపల ఔన్నత్యం పెంచుకొంటూ రావాలి, లోపల సాధన పెంచుకోవాలి, లోపల కూల్‌గా ఉండాలి, బయటకు అందరిలాగే కామన్‌గా ఉండాలి. కొంచం సాధనచేసి ఏదో ప్రత్యేకత సంపాదించాము అనుకొంటే మరల వెనక్కి వెళ్ళిపోతాము. ఒక అడుగు ముందుకు వేసి మరల నాలుగు అడుగులు వెనక్కి వేస్తే మనం గమ్యానికి ఎలా వెళ్ళగలము. ఏదో కొంత సాధన చేసి మేము బాగానే చేస్తున్నాము అని ఊహించుకొంటే ఉన్నది ఊడిపోతుంది. బయట ఉన్న గురువు నిన్ను లోపలకు పంపటానికి ప్రయత్నం చేస్తాడు. ఏ కారణం వలన నీ మనస్సు బాహ్యముఖమవుతోందో చూసుకొని దానిని కట్ చేస్తాడు. నిజమైన గురువు మన లోపలే ఉన్నాడు, ఆయన నిన్ను లోపలకు లాగుకొంటాడు. ఎప్పుడైతే మూలతలంపు మూలాన్ని నువ్వు టచ్ చేసావో, దాని తాలుక స్పర్శ, దాని తాలుక రుచి నీకు ఎప్పుడైతే తెలిసిందో అప్పుడు ఆనందసముద్రం ఒక్కసారిగా పొంగి నీ సహస్రారాన్ని ముంచేస్తుంది. అప్పుడు మనస్సు

పడిపోతుంది, బేధబుద్ధి పడిపోతుంది, నీవు కానిదానిలో నుండి సహజంగానే విడిపోతావు. ఆత్మానందాన్ని ఎంజాయ్ చేయటానికి ఎప్పడో శరీరం చనిపోయేవరకు మీరు ఆగనక్కరలేదు. మీరు కానిదానితో తాదాత్మ్యం వదిలేయండి, లోపలఉన్న ఆనందాన్ని ఇప్పడే అనుభవించవచ్చు.

నేను అలిసిపోయాను, నేను అలిసిపోయాను అని ప్రతీగంటకు అనుకోనక్కరలేదు. మీరు సహజంగా, నిర్మలంగా జీవించండి. మన మాటలో, చేతలో, ఆలోచనలో ఆడంబరం కనబడకూడదు. లోపల పని జరిగిపోతూ ఉండాలి, వ్యక్తి కనబడకూడదు. నీ శరీరాన్ని చంపనక్కరలేదు, వేరుభావనను చంపు. దేహంతో తాదాత్మ్యం పొందే మొదటితలంపే వేరు భావనను తీసుకొని వస్తోంది, దానిని సంహరించు సరిపోతుంది, అదే సాధన. దాని కోసం నీకు నచ్చిన మార్గంలో ప్రయాణం చెయ్యి. సత్యాన్ని తీసుకొని వెళ్ళి ఒక రూపానికి, నామానికి పరిమితం చేస్తున్నాము, ఇది దురదృష్టం. ఏసుక్రీస్తు దేవుడు అని ఈ మధ్య ఒకరు నాకు లెటరు వ్రాసారు. అంటే ఏసుక్రీస్తు శరీరం దేవుడా? అంతటా వ్యాపించి ఉన్న బ్రహ్మాన్ని తీసుకొని వచ్చి ఒక రూపానికి, నామానికి బంధించటం అంటే సత్యాన్ని అగౌరవ పరచటం అవుతుంది. మనం సాధనకోసం ఒక రూపాన్ని, నామాన్ని సపోర్టుగా తీసుకోవచ్చు. బాహ్యమైన ప్రక్రియలకు, మహిమలకు మోసపోవద్దు. వాటిమీద మోహం కలగటానికి నీ మనస్సులో ఉన్న మాయ కారణం. ఇక్కడ భగవాన్ చెప్పేది ఏమిటి అంటే నీకు ఇష్టమైన మార్గంలో ప్రయాణం చెయ్యి. ప్రపంచంలో అనేకమంది మహాత్ములు, మహర్షులు ఉన్నారు. ఎవరి సమక్షంలో నీ మనస్సు యొక్క విజృంభణ ఆగిపోతోందో, ఎవరి సమక్షంలో నీకు లోచూపు కలుగుతోందో, ఎవరి సమక్షంలో నిర్వాణసుఖం యొక్క రుచి ఎంతోకొంత నీకు తెలుస్తోందో వారిని గురువుగా తీసుకో. వాడు ఏమతస్థుడు, ఏ కులస్థుడు అనేది అనవసరం. ఈ పద్ధతిలోనే ఉండు అని బలవంతం చేసే అలవాటు భగవాన్‌కు లేదు, అసలు ప్రపంచమే లేనివాడికి బలవంతం ఏమిటి?

ధర్మం, అధర్మం అంటే ఏమీలేదు. మన డ్యూటీ మనం చేయటం ధర్మం, మన డ్యూటీ మనం చేయకపోవటం అధర్మం. మనిషి పుట్టాడు అంటే వాడికూడా దుఃఖం వచ్చేస్తుంది. వాడు ఎంత ధనవంతుడు అయినా ఎంతోకొంత దుఃఖస్పర్శ లేని మనిషిని చూపించండి. మనం ఇష్టంతోగాని, అయిష్టంతోగాని పనులు చేస్తాము. ఇష్టాలు, అయిష్టాలు ప్రక్కన పెట్టి భగవంతుడు చేయమని చెప్పాడు కదా అని పనులు చేయము. రాగద్వేషాలను ప్రక్కన పెడితే కర్మ మనలను చుట్టుకోదు. రాగద్వేషాలతో కర్మచేస్తాము, దానినిబట్టి జన్మ వస్తుంది, జన్మ వస్తే దుఃఖం వస్తుంది. రాగద్వేషాలు ఎందుకు వస్తున్నాయి అంటే దేహంతో తాదాత్మ్యం పొందే నేను వలన వస్తున్నాయి. ఈ నేనులో నుండి విడుదల పొందకుండా కర్మచక్రంలోనుండి బయటకు రాలేవు, అజ్ఞానం

అంటే ఎక్కడో ఉంది అనుకోవద్దు, ఈ నేను రూపంలోనే ఉంది, ఇది లేకపోతే ఏదీ లేదు. ఇదే మూలతలంపు. ఈ మూలతలంపు మూలంలోనే సత్యం ఉంది. నీ మనస్సుకు అంతర్దృష్టిని కలుగజెయ్యి. నీ మనస్సుకు లోచూపు కలుగజేసేవాడే గురువు. గురువు యొక్క ప్రేమ భౌతికమైనది కాదు. గురువు మనలను ప్రేమిస్తాడు దానికి కారణం కనబడదు. అకారణ భక్తి, అకారణ ప్రేమ వలన మనకు జ్ఞానోదయం కలుగుతుంది. సత్యం నీ హృదయంలోనే ఉంది. దాని గురించి మనం నోటితో చెప్పలేము, చేతితో వ్రాయలేము. అది లేదా అంటే ఉంది. అది ఉండటం వలననే అది తెలియబడుతుంది. గాఢనిద్రలో, స్వప్నావస్థలో, జాగ్రదవస్థలో ఒక్క క్షణం కూడా బ్రేక్ లేకుండా తనంతట తానుగా అది ప్రకాశిస్తోంది. దానికి చావు ఎలా ఉంటుందో, పుట్టుక ఎలా ఉంటుందో తెలియదు, అది ఆనందసముద్రం, సుఖసముద్రం, శాంతిసముద్రం. చావు పుట్టుకలతో సంబంధం లేని, ప్రకృతితో సంబంధంలేని, దేహంతో సంబంధంలేని ఆ సుఖాన్ని నీవు ఎంజాయ్ చెయ్యాలంటే మిధ్యానేను అనే తెరను తొలగించు అంటే మిధ్యా నేనును ఎలిమినేట్ చెయ్యి అప్పుడు సుఖసముద్రం పొంగి నీ సహస్రారాన్ని ముంచేస్తుంది, అప్పుడు సాధన చేసేవాడు కూడా నీకు కనబడడు, వాడు శాంతిసముద్రంలో కొట్టుకొని పోతాడు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, 13-11-05, విశాఖపట్నం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం పనిచేసేటప్పుడు నిండు మనస్సుతో, హృదయపూర్వకంగా, నిర్మలంగా, నిశ్చలంగా, నిరాడంబరంగా చేసుకొంటూ వెళ్ళాలి. ఇతరులతో పోల్చుకోవలసిన అవసరం లేదు. ఇతరులతో పోల్చుకొంటే మేము గొప్పవారము, మేము తక్కువ వారము అనిపిస్తుంది, దానివలన ద్వైతబుద్ధి పెరుగుతుంది. సమాజానికి సంబంధించినంత వరకు మనం పెద్ద పని చేసామా, చిన్న పని చేసామా అనేది ముఖ్యం కాదు. మనవంతు కృషి మనం చేస్తే సరిపోతుంది. ఒకసారి కాంగ్రెస్ గురించి డొనేషన్స్ ఇస్తూఉంటే 10 రూ॥ ఇచ్చేవారు ఇచ్చారు, 20 రూ॥ ఇచ్చేవారు ఇచ్చారు, 100 రూ॥ ఇచ్చేవారు ఇచ్చారు, ఒక బీద ముసలమ్మ ఒక రూపాయి ఇచ్చింది, బోస్ ఆ రూపాయిని ముద్దు పెట్టుకొన్నాడు. అమ్మా ఈ రూపాయి ముఖ్యం కాదు, ఈ రూపాయి వెనుకనున్న నీ ప్రేమ ముఖ్యం, ఆ ఆప్యాయత ముఖ్యం అన్నాడు. ఒకరు గాంధీగారికి ఏదో పని నిమిత్తం ఒక లక్ష రూపాయలు డొనేషన్‌గా ఇచ్చి, బాపూజీ మీరు సంతోషించారు కదా అని అన్నాడు. అప్పుడు గాంధీగారు ఏమన్నారు అంటే నేను ఇప్పుడు సంతోషించను, ఇచ్చే వాడిని ఇచ్చేస్తే అప్పుడు నేను సంతోషిస్తాను అన్నారు. రాముడు చాలా శక్తివంతుడు, ఆయనకు ఎవరి సహకారం అక్కరలేదు. కాని లంకకు వారధి నిర్మించే టప్పుడు అందరు ఎవరివంతు కృషి వారు చేసారు. లోకాచారం

ప్రకారం వీరందరి సహకారం తీసుకొన్నాడు. దేహం ధరించి వచ్చాడు కాబట్టి ఎప్పుడైతే దేహం ఉందో, మనస్సు ఉందో దానికి కొన్ని పరిమితులు ఉంటాయి, భగవంతుడు అయినా ఆ పరిమితులకు లోబడి ఉంటాడు, పెద్దపెద్ద తపస్సులు చేసినవారు ఏ లోకాలకు వెళుతున్నారో అక్కడకు వెళ్ళు జటాయువు అన్నాడు, వెళ్ళవలసిందే, ఆ మాట నెరవేరవలసిందే, వాడు రాముడు.

మన హృదయంలో మరణం లేని వస్తువు ఒకటి ఉంది. అదే ఆత్మ, వాడే పురుషుడు. వాడే అంతటా వ్యాపించి ఉన్నాడు, ఈ సృష్టికి కర్త ఆయనే. ప్రభువు ఎక్కడో ఉన్నాడు అని నీవు అనుకొన్నా వాడు, వీడు వేరుగా లేరు, వాడే వీడు, వీడే వాడు. ఈ లోపల ఉన్న వాడిని భక్తులు ఈశ్వరుడు అని పిలుచుకొంటున్నారు, జ్ఞానులు బ్రహ్మం అంటున్నారు. వాడు పొగలేని జ్యోతిలాగ ఉన్నాడు, వాడిని ఎరుకలోనికి తెచ్చుకొంటే భయరహితుడివి అవుతావు. భగవంతుడు మన హృదయంలో ఉన్నాడు అంటే కాదు. నీవు శరీరంతో, మనస్సుతో ఎలా తాదాత్మ్యం పొందుతున్నావో అలాగ హృదయంలో ఉన్న వాడితో తాదాత్మ్యం పొందితే భయం నుండి, దుఃఖం నుండి, ఈ జన్మల నుండి విడుదలపొందుతావు, అదే ముక్తి అని మంత్రపుష్పంలో చెపుతాడు. ఉన్నవాడు ఉన్నాడా, లేడా అని ఏ రోజుకారోజు సందేహపడే వాడికి వాడు తెలియబడడు. కొంతమంది ఎలా ఉంటారు అంటే వారిని చూసి వాళ్ళకే అనుమానం, వారి నీడను చూసి వారే భయపడటం, ఇటువంటి వారికి పురుషుడు ఎరుకలోనికి రాడు. భగవంతుడు ఉన్నాడనే ప్రగాఢమైన విశ్వాసం ఉండాలి, ఆయనకు మనలను మనం అర్పించుకోవాలి. అర్పణభావన, శరణాగతిభావన ఉండాలి. ఏ విధమైన కోరికలు లేకుండా, మినహాయింపులు లేకుండా ఆయనకు శరణాగతి పొందితే ఆయన మనకు ఎరుకలోనికి వస్తాడు, వాడు పురుషోత్తముడు. మేము మంచి వారము అని చాలామంది అనుకొంటారు. మీరు మంచివారు అని మీరు అనుకొంటే సరిపోదు, ఆయన అనుకోవాలి. ఈ భూమి మీదకు వచ్చిన పని మర్చిపోవద్దు. నేను నీ లోపలే ఉన్నాను, నీ అలవాట్ల యొక్క వేగం వలన, నీ తలంపుల యొక్క వేగం వలన నేను లోపల అంతర్యామిగా ఉన్నాననే అవగాహన నీకు రావటం లేదు. నీవు ఇతరులమీద ఆధారపడకుండా, నీ కృషి ఏదో నీవు చేసుకొంటూ, వ్యవహారంలో, ఆహారంలో, నిద్రలో తగుమాత్రంగా ఉంటూ నన్ను ఎరుకలోనికి తెచ్చుకోవటానికి ప్రయత్నం చెయ్యి అని భగవంతుడు చెపుతున్నాడు. మన ఇంట్లో వారి వలన, బయట పరిస్థితుల వలన మనకు కొంత అశాంతి రావచ్చు కాని అవి స్వల్ప విషయాలు. అవి రూపాయికి 5 పైసలు మాత్రమే, మిగతా 95 పైసలు అశాంతికి మనమే కారణం. దుఃఖం శరీరంలో లేదు, మనస్సులో ఉంది. మనం ఒక ప్రక్క మనో నాశనానికి కృషి చేస్తూ, రెండో ప్రక్క తత్వజ్ఞానం పొందటానికి కృషిచేస్తూ ఉంటే అప్పుడు తరిస్తాము. భగవంతుడి యొక్క నామాన్ని

నిరంతరం స్మరిస్తూ ఉంటే నీ మనస్సు శోధింపబడుతుంది, అప్పుడు మనస్సులో ఉన్న మలినవాసనలు పోతాయి. భగవంతుడి నామాన్ని స్మరించటం వలన నీవు పవిత్రుడవు అవుతావు. మనోనాశనం అవ్వటం అంటే పిచ్చోళ్ళుగా మారటం కాదు, మనస్సు భగవంతుడిలో ఐక్యం అవ్వటం, మనస్సు తదాకారం పొందాలి, అదే ముక్తి, అదే మోక్షం.

మనకు ధర్మాచరణ లేదు, మంచి ఆలోచన లేదు. మనకు మంచి ఆలోచనలు వస్తూ ఉంటే మంచి మాటలు మాట్లాడతాము, మంచిపనులు చేస్తాము. మన ఆలోచనలు ఒక క్రమంలో లేనప్పుడు మంచిపనులు చేయలేము. మనలను మనం నియమించుకోవాలి. మనస్సును నిగ్రహించుకోవటానికి అనేక పద్ధతులను ఆత్మసంయమయోగంలో పరమాత్మ చెప్పాడు. సాధకులు అందరూ ఈ అధ్యాయం కనుక అధ్యయనం చేస్తే ఇంద్రియాలను, మనస్సును ఎలా నియమించుకోవాలి, మన ప్రవర్తనను ఎలా తీర్చిదిద్దుకోవాలి, ఎలా ఉంటే మనలను శాంతి, సుఖం వరిస్తాయి అనేది తెలుస్తుంది. ఇందులో మనోనిగ్రహానికి భగవంతుడు అనేక ఉపాయాలు చెప్పాడు. ఏదో ఒక ఉపాయాన్ని సపోర్టుగా తీసుకొని మనం తరించాలి. మన జీవితం ఒక క్రమబద్ధంగా లేదు, మనకు సామాజికస్పృహ లేదు, రాగద్వేషములను పెంచుకొంటున్నాము. దానివలన మనకు ఎంత సంపద ఉన్నా శాంతి రాదు. క్రమశిక్షణ లేని ధనం భోగప్రవృత్తిని పెంచుతుంది, భోగం బంధాన్ని తీసుకొని వస్తుంది. ధనం, పాండిత్యం, కీర్తి ఇవి అన్నీ పనిముట్లు, వాటంతట అవి చెడ్డవి కాదు, మనం ఉపయోగించుకోవటంలో ఉంటుంది. వాటిని ఎలా ఉపయోగించుకోవాలో పరమాత్మ గీతలో చెప్పాడు. అది జాగ్రత్తగా అధ్యయనం చేసి, అర్థం చేసుకొని, ఆ ప్రకారం మనం జీవిస్తూ ఉంటే ఆయన దయకు పాత్రులమవుతాము. మాకు శాంతిలేదు అని చాలామంది అంటారు, అసలు నువ్వు శాంతికోసం ప్రయత్నం చేసావా? ప్రయత్నం లేదు. శాస్త్రాన్ని అధ్యయనం చేసావా? నీకు సత్పురుషులతో సహవాసం ఉందా? ఇవి ఏమీ లేకుండా నీకు శాంతి ఎలా దొరుకుతుంది. కొంతమంది ఎప్పుడూ బిజీ, బిజీ అంటారు. శరీరానికి చావు వస్తుంది అనుకో అప్పుడు నీ బిజీ మాట ఏమిటి? యమధర్మరాజు ఆగుతాడా? బిజీగా ఉండి మీరు సాధిస్తున్నది ఏమిటి? మనం ఇతరులను విమర్శిస్తున్నాము కాని మనలను మనం విమర్శించుకోవటం లేదు. మనలను మనం విమర్శించుకొంటే మనం బాగుపడతాము, ఆత్మజ్ఞానం వస్తుంది. మీకు శాంతి లేకపోవటానికి మీరే కారణం, అది ఎవరి మీద నెట్టవద్దు. నీకు శాంతి లేదు అంటే నీ మనస్సు నిన్ను ఇబ్బంది పెడుతోంది, మనస్సును బాగుచేసుకోవటానికి హోలీ కంపెనీ అవసరం. కాని మనకు వారితో సహవాసం చేయాలనే బుద్ధి కలగటం లేదు. మన చెడుఅలవాట్లే, మనలో ఉన్న బలహీనతలే మన అశాంతికి కారణం అన్న విషయం మనకు

తెలియటం లేదు, ఎవరో ఒకరి మీదకు నెట్టటానికి ప్రయత్నం చేస్తున్నాము.

మనస్సును నియమించుకోవటానికి కూడా గట్టి పట్టుదల ఉండాలి. రామతీర్థ ఒకసారి గంగానది ఒడ్డున కూర్చొని సాయంత్రం లోపుగా మనోనిగ్రహం రాకపోతే నదిలో పడి చనిపోతాను అనుకొన్నాడు. మనోనిగ్రహం రాలేదు అంతే నదిలో ఉరికేసాడు. గంగమ్మ కూడా దేవతే, గంగమ్మ ఏమి చేసింది అంటే ఒక కెరటం తీసుకొని వచ్చి ఒడ్డుకు పడేసింది, ఆయన చేత నీరు కక్కించారు, బ్రతికాడు. మరునాడు ఆయనకు మనోనిగ్రహం కుదిరింది. సాధించటమో లేక ఆ ప్రయత్నంలో మరణించటమో అనే పట్టుదల ఉండాలి. అసలు మనకు దీక్ష లేదు. అంతటా నీరు ఉంది అనుకోండి, ఇంక నీటికోసం నూతి దగ్గరకు, కాలువ దగ్గరకు వెళ్ళనక్కరలేదు అలాగే నీ హృదయంలో ఉన్న శాంతి నీకు దొరికినప్పడు ఎటుచూసినా శాంతే, ఎటుచూసినా సుఖమే. అప్పడు సుఖంకోసం, శాంతికోసం నీవు ఇతరుల మీద, బాహ్యమైన వస్తువుల మీద ఆధారపడవలసిన పనిలేదు అని పరమాత్మ చెప్పాడు. ఇప్పడు బాహ్యంగా నీవు అనుభవించే విషయాలు అమృతంలాగ అనిపిస్తాయి కాని అవి పరిణామంలో విషంలాగ మారిపోతాయి. భగవంతుడు చెప్పిన మాటలు మొదట నీకు విషంలాగ అనిపించినా, చివరకు పరిణామంలో అమృతం అయిపోతాయి.

భక్తి లేకుండా, ఉపాసన లేకుండా, ఏకాగ్రత లేకుండా, పవిత్రత లేకుండా మనకు మోక్షం రాదు. గాఢనిద్ర మనకు గురువు ఎందుకంటే గాఢనిద్రలో మనం కానిదానిలో నుండి మనం విడుదల పొందుతున్నాము, కాని అక్కడ మనం లేమా అంటే ఉన్నాము, మనం నిజంగా దేహం అయితే గాఢనిద్రలో కూడా మనకు దేహధ్యాస ఉండాలి. గాఢనిద్రలో ఎవడైతే ఉన్నాడో వాడు జాగ్రదవస్థలో కూడా ఉన్నాడు, వాడు మనలో అంతర్యామిగా ఉన్నాడు. మనం సాధన చేసి వాడిని ఎరుకలోనికి తెచ్చుకొంటే జననమరణ చక్రం నుండి విడుదల పొందుతాము. గుడిలో రాయి ఉంది మనం దానికి పూజ చేస్తున్నాము, జపం చేస్తున్నాము, అది సాక్షిక సత్యమే. ఈ కొండ దేవుడు ఎలా అవుతుంది అని భగవాన్‌ను అడిగారు. ఈ శవాన్ని నేను నేను అని అనుకొంటున్నావు, ఈ శవం నీవా అన్నారు. నీవు కాని శరీరాన్ని నీవు అనుకోవటం ఎంత నిజమో ఆ కొండను నేను అని శివుడు అనుకోవటం అంతే నిజం. నీ దేహానికి ఎవరైనా నమస్కారం పెడితే నాకు వారు నమస్కారం పెడుతున్నారు అని అనుకొంటావు. అలాగే కొండరూపంలో ఉన్న శివుడికి నమస్కారం పెడితే నాకే పెడుతున్నారు అని శివుడు అనుకొంటాడు. ఇవి సాక్షికసత్యాలే.

సాధన చేసేటప్పడు నీకు మహిమలు కలుగవచ్చు, మనస్సు అణిగినప్పడు నీకు కొంత

శాంతిగా ఉండవచ్చు, ఇవి ఏమి కలిగినా, నీవు ఏదిగా ఉన్నావో దాని తాలుక ఎరుక, దాని తాలుక అనుభవం నీకు కలిగేవరకు ఇదికాదు, ఇది కాదు అనుకొంటూ నీవు లోపలకు వెళ్ళు, మధ్యలో ఆగిపోవద్దు. నీవు మద్రాసు వెళ్ళేటప్పుడు అనేక స్టేషన్‌లు వస్తాయి, ఆ స్టేషన్‌లలో దిగకుండా ఉంటేనే మద్రాసు వెళతావు. అలాగే సాధన చేసేటప్పుడు మహిమలు రావచ్చు, సంతోషం రావచ్చు, పొంగు రావచ్చు, దుఃఖం రావచ్చు, ఇవిఅన్నీ వికారములే, వీటిని అతిక్రమించి నీవు నిర్వికారుడవు అయినప్పుడు కదా నిన్ను ఆత్మజ్ఞానం వరించేది. పెళ్ళి అయిన తరువాత తల్లిని మర్చిపోతారు, బల్లకట్టు సహాయంతో నదిని దాటిన తరువాత బల్లకట్టు మర్చిపోతారు, జబ్బు తగ్గిన తరువాత డాక్టరును మర్చిపోతారు, కష్టపడి విద్యను నేర్పిన గురువును మర్చిపోతారు, ఇవిఅన్నీ లోకంలో సహజం సుమా. కాని ఇవిఏమీ మర్చిపోకుండా, వాటిని గుర్తుపెట్టుకొని, ఎవడైతే కృతజ్ఞత కలిగి ఉంటాడో వాడు ఆత్మజ్ఞానానికి అర్హుడవుతాడు అని భారతంలో చెప్పారు. మనం పైకి అందరిలాగే ఉండాలి, లోపల వైరాగ్యం పెంచుకొంటూరావాలి. మనోనిగ్రహం కష్టమే కాని అభ్యాసం, వైరాగ్యం ఇవి రెండూ ఉంటే అది నీకు సాధ్యమే. ఒడ్డుకు చేరుకొనేవరకు అభ్యాసం, వైరాగ్యం ఇవి రెండూ విడిచిపెట్టవద్దు. కొంతమంది మంచివారి మధ్య, ధనవంతుల మధ్య, అనుకూలపరిస్థితుల మధ్య ఉంటారు. ఇన్ని అవకాశములు ఉన్నప్పటికీ వారు వైరాగ్యం విడిచిపెట్టరు, అటువంటి వారిని ఈశ్వరుడు అనుగ్రహిస్తాడు.

మనం నేను, నేను అంటాము, ఈ నేను ఇంద్రియములతోటి, మనస్సుతోటి, రాగ ద్వేషములతోటి, వ్యక్తిభావనతోటి కలిసిపోయి కలుషితమై ఉంది, ఈ కలుషితమైన నేను నిన్ను బంధిస్తుంది. కృష్ణుడు కూడా గీతలో నేను, నేను అంటాడు, ఆ నేను అన్నింటికి అతీతమైనది అందుచేత ఆ నేను బంధించదు. కృష్ణుడు నేను, నేను అన్నాడు మనం కూడా నేను, నేను అంటున్నాము అనుకోవద్దు. ఈ నేనుకు, ఆ నేనుకు ఎంతదూరం ఉందో మనం ఊహించలేము. మనం రోజూ మాట్లాడే మాటలు 90 మాటలు అహంకారం కోసం మాట్లాడతాము, 10 మాటలు అవసరముండి మాట్లాడతాము. ఈ మాటలు అన్నీ లోపల అహంభావనకు ఫుడ్ సప్లయి చేస్తున్నాయి అన్న ఎరుక కూడా మనకు లేదు. అంతా ఈశ్వర సంకల్పం ప్రకారం జరుగుతోంది. ఉన్నది ఆయనే, మనం లేము. ఈశ్వరుడిని కాదని ప్రవర్తించటానికి నువ్వు అంటూ ఒకడివి ఉన్నావా, ఉంటే వాడు ఎవ్వడు, Who is that I? రమణభగవాన్ టీచింగ్ అంతా అక్కడే ఉంది. నాకు డబ్బు ఉంది, చదువు ఉంది, అధికారం ఉంది అనుకొంటున్నావు కదా. నాకు ఇవి అన్నీ ఉన్నాయి అనుకొనేవాడు లోపల ఒకడు ఉన్నాడు కదా. Who is that I? దానికి సమాధానం చెప్పు. పూసల మధ్యలో దారం ఎలా ఉంటుందో అన్ని తలంపుల మధ్య నేను అనే తలంపు

కామన్‌గా ఉంది. అది నీలోపల నుండే వస్తోంది అని తెలియటానికి శాస్త్రాలు చదవనక్కరలేదు, కామన్‌సెన్స్ ఉంటే సరిపోతుంది. మూలతలంపును ఉపసంహరించి, ఉపసంహరించి మూలతలంపు మూలం లోనికి వెళ్ళగలిగితే అది నశిస్తుంది, అది నశిస్తే నీవు నశించవు అఖండమైన వస్తువు నీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది. మీరు సాధన చేసేటప్పుడు సంతోషం రావచ్చు, భయం రావచ్చు, ఇదంతా ద్వయీభావమే. ఒకసారి రామకృష్ణుడు వివేకానందుడిని టచ్‌చేసి భౌతిక స్థితి నుండి అభౌతికస్థితికి పంపటానికి ప్రయత్నం చేసాడు. అప్పుడు వివేకానందుడికి భయం వచ్చేసింది. నన్ను నాకు కాకుండా చేసేస్తున్నావు నీవు అని భయం వచ్చింది. నరేన్ ప్రస్తుతానికి ఇది చాలు, ప్రపంచానికి నీవు బోధిస్తావు అన్నాడు రామకృష్ణుడు. లోపలఉన్న చైతన్యానికి, ఈశ్వరుడికి కార్యకారణ సంబంధం లేదు. నీ మనస్సుకు కార్యకారణ సంబంధం ఉంది, అందుచేత నీవు చేస్తావు అనుభవిస్తావు. ద్వయీభావన లేనివాడికి కార్యకారణ సంబంధం లేదు, వాడు పురుషుడు, వాడు నీ హృదయంలోనే ఉన్నాడు, వాడు ఉండటం వలననే వాడు తెలియబడతాడు కాని వాడు తెలియబడటానికి ఎవరి సహాయం అక్కరలేదు. మన శరీరం, మనస్సు, ఇంద్రియాలు, పంచభూతాలు అంతా ప్రకృతే. వీటిని ఆడించేవాడు లోపల ఉన్నాడు. ఆయనకు తెలియకుండా ఏదీ జరుగదు. ఆయన ఎలా ఆడిస్తే ఇవిఅన్నీ అలా ఆడవలసిందే. అందుచేత ఆయనను శరణువేడుకో.

ఒక చేతితో నీ ఇంటి దగ్గర పని చేసుకో, రెండో చేతితో ఈశ్వరుని పాదాలను పట్టుకో. నీ ఇంటిదగ్గర పని అయిపోతే వెళ్ళి బజారులో పడిపోకు, అప్పుడు రెండు చేతులతో ఈశ్వరుని పాదాలను పట్టుకో, అప్పుడు నీవు తరిస్తావు. మనం కూర్చొన్నా, నిలుచున్నా, నడుస్తున్నా మంచి తలంపులు వచ్చేలాగ చూసుకోవాలి. మంచి తలంపులు లేకుండా మంచి పనులు చేయలేము, మంచి మాటలు మాట్లాడలేము. మనకు మంచి తలంపులు వస్తూ ఉంటే శ్వాస నియమబద్ధంగా ఉంటుంది. మన జీవితాన్ని నడిపించేది తలంపులే. తలంపుల విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి. మరణించిన తరువాత శరీరం నీకూడా రాదు, నీ కూడా రాని శరీరం గురించి అనేక జాగ్రత్తలు తీసుకొంటున్నావు. మరణానంతరం నీ కూడా వచ్చే జీవుడి గురించి కొంచెం కూడా జాగ్రత్త తీసుకోవటం లేదు. ఏదయితే సత్యమో అదే నిత్యము, అదే ఆనందం, అదే శాంతి. అది నీ హృదయంలో ఉంది, అంతటా వ్యాపించి ఉంది నీ హృదయంలో ఉన్న సత్యంను చేరుకొనేవరకు అటు, ఇటు చూడవద్దు, ప్రయాణం మధ్యలో ఆపవద్దు. మీ పనులు మీరు శ్రద్ధగా చేసుకోండి. కొంచెం స్వార్థం తగ్గించుకొంటే మీ ద్వారా సమాజానికి సహాయసహకారములు అందుతాయి, మీరు ఈశ్వరుని దయకు పాత్రులవుతారు. మనం

ఏదైనా ఒక పని చేసేటప్పుడు అది సమాజానికి ఉపయోగపడాలి, అదే పని మీకు మోక్షం రావటానికి సహకరించాలి, అంటే అంతఃకరణశుద్ధి అవ్వాలి.

మనం ఈ భూమి మీదకు వచ్చినందుకు సాధన చేసి కనీసం ఒక్క వాసనను అయినా తగ్గించుకొని ఈ భూమి మీద నుండి వెళ్ళిపోవాలి. కాని మనం ఏమి చేస్తున్నాము అంటే పది వాసనలతో వచ్చి, ఇక్కడ ఇంకో పది వాసనలు కలుపుకొని ఈ భూమి మీద నుండి వెళుతున్నాము, ఇటువంటి మనకా మోక్షం కలిగేది? ఒక 10 రూపాయలు అప్పుతో వచ్చి, ఇంకో పది రూపాయలు అప్పుచేసి మొత్తం 20 రూపాయలు అప్పుతో బయటకు వెళుతున్నాము. అలాకాదు కనీసం 5 రూపాయలు అప్పు తగ్గించుకొని 5 రూపాయల అప్పుతో బయటకు వెళితే పరవాలేదు. మనం సాధన పేరుతో వాసనలు పెంచుకొంటున్నాము, ఇది ప్రమాదం. మన డ్యూటీ మనం శ్రద్ధగా చేయాలి, జరిగేది జరుగుతుంది. పని నీ చేతిలో ఉంది కాని ఫలితం నీ చేతిలో లేదు. ఫలితం నీ చేతిలో లేదని పనిమానివేసి సోమరితనానికి అలవాటు పడవద్దు. బలహీనులకు, బద్ధకస్తులకు ఆత్మజ్ఞానం కలుగదు. మనం పనిచేసి మర్చిపోవాలి. ఫలితం కోసం ఎదురు చూస్తూ ఉంటే బుద్ధి కల్మషం అయిపోతుంది, బుద్ధి మోహకలిలంలో కూరుకొనిపోతుంది. బుద్ధుడు భిక్ష చేసుకొనేటప్పుడు వాళ్ళ ఇంటి దగ్గర కూడా భిక్ష చేస్తాడు, వాడి నిరహంకారస్థితిని చూడండి. నీవు మహారాజువు, ఈ భిక్ష చేసుకోవటం ఏమిటి అంటాడు తండ్రి, నిజమే రాజులు భిక్ష చేసుకోకూడదు, కాని నేను భిక్షువుని అంటాడు, ఎంత నిరహంకారమో చూడండి. ఇది నోటితో చెప్పటం తేలిక, ప్రాక్టికల్‌గా చేయటం ఎంత కష్టమో చూడండి.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 26-01-06, తాడినాడ

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఇతరుల క్షేమం కోసం, ఇతరుల మంచికోసం మనం ఏ పనిచేసినా అది యజ్ఞమే. ఇతరుల క్షేమం కోసం మాటమాట్లాడినా, శరీరంతో పనిచేసినా, ఇతరులకు మంచి జరగాలని మనస్సులో సంకల్పించుకొన్నా ఇది అంతా యజ్ఞమే. మనకు మంచితలంపులు వచ్చినా, చెడుతలంపులు వచ్చినా, కోరికలు వచ్చినా అన్నీకూడా దేహము నేను అనే బుద్ధిలో నుండే వస్తున్నాయి. మనలో రెండు నేనులు ఉన్నాయి. చనిపోయే నేను, చావులేని నేను రెండూ మనలోనే ఉన్నాయి. దేహం చనిపోయేటప్పుడు నేను చనిపోతున్నాను అనుకొంటాము కదా, అంటే దేహము నేను అనే బుద్ధి ఈ నేనుకు ఉంది, ఇదే దేహగతమైన నేను, చనిపోయే నేను, మిధ్యానేను. ఈ చనిపోయే నేను మనలో ఉన్నంతకాలం మనం చనిపోతూ ఉంటాము, పుడుతూ ఉంటాము. ఇది దేహంతో కలిసి ఉంటుంది కాబట్టి దేహం

చనిపోయినప్పుడు నేను చనిపోతున్నాను అనుకొంటుంది. చావని నేను ఒకటి మన హృదయంలో ఉంది. అది చనిపోదు. దానికి దేహం లేదు. దేహం ఉంటే చనిపోతుంది, దేహం లేకపోతే చావు ఏమిటి? అది సత్యమైన నేను, అదే ఆత్మ, అదే చైతన్యం, వాడే ఈశ్వరుడు. చావులేని నేను మనకు అనుభవంలోనికి వచ్చే వరకు చావు పుట్టుకలు తప్పవు, సంసారం తప్పదు, సంకల్ప వికల్పాలు, రాగద్వేషములు తప్పవు. ఎవడైతే చనిపోయే నేనులో నుండి బయటకు వచ్చాడో వాడికి చావులేని నేను తెలుస్తుంది. ఎవడైతే అసత్యమైన నేనులో నుండి బయటకు రావటానికి ప్రయత్నం చేస్తున్నాడో వాడు మోక్షమార్గంలో ప్రయాణం చేస్తున్నట్లు గుర్తు. మోక్షమార్గంలో ఉన్నవాడికి మోక్షం తెలుస్తుంది కాని ఆ మార్గంలో లేనివాడికి మోక్షం గురించి తెలియదు. ఆ మార్గంలో ఉన్నామా, లేదా అని మనం చూసుకోవాలి. ఎన్ని శాస్త్రాలు చదివినా ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం గురించి చెప్పారు. ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం రావాలంటే అంత తేలికగా రావు. మనం పాయసం తాగేటప్పుడు ఎంత ఇష్టంగా తీసుకొంటామో అంత ఇష్టంగా, శ్రద్ధగా ప్రయత్నం చేస్తే గాని ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం రాదు. చిరాకుగా, విసుగుగా, అయిష్టంతో ప్రయత్నం చేస్తే అవి స్వాధీనంలోనికి రావు. ఆహార నియమం వలన ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం వస్తుంది. అధ్యయనం ప్రీతిగా, ఇష్టంతో చేయాలి. ఋషి చెప్పిన మాటలను జాగ్రత్తగా అధ్యయనం చేసి, త్రికరణ శుద్ధిగా పనిచేస్తే వాడికి మోక్షం కలుగుతుంది. మనకు శరీరం, మనస్సు, మాట తెలుస్తున్నాయి. ఈ మూడు ఒకటిగా ఉండి పనిచేస్తే మోక్షం వస్తుంది. మనం హృదయపూర్వకంగా, ఈశ్వరార్పణబుద్ధితో పనిచేయాలి.

మనకు గతజన్మలను బట్టి అదృష్టం, దురదృష్టం, సంతోషం, దుఃఖం వస్తూ ఉంటాయి. ఇవి అన్నీ అసత్యములే, ఇవిఅన్నీ తలంపులే. అందుచేత వీటి గురించి ఉద్రేక పడకూడదు, కృంగిపోకూడదు. ఇవి సాధకుడికి పనికిరావు. బుద్ధిని సమానంగా ఉంచు కోవాలి. ఏది వచ్చినా భగవంతుడి ప్రసాదంగా తీసుకోవాలి. భగవంతుడికి తెలియకుండా ఏదీ రావటం లేదు. తలంపులు, ఆలోచనలు, రాగద్వేషములు, సంకల్పవికల్పాలు అన్నీ అసత్యమైననేనుకే. ఇవిఅన్నీ చనిపోయే నేనుకే వస్తున్నాయి. ఈ వ్యవహారం అంతా అసత్యమే. మీకు వెయ్యి కోట్లు డబ్బు ఉన్నా, మీరు డబ్బులేక ఇబ్బందులు పడుతున్నా చైతన్య దృష్టితో చూసినప్పుడు ఇదిఅంతా అసత్యమే. మనది పాడుబుద్ధి. మనం పూర్వజన్మలలో మంచికర్మలు చేసిఉంటే, భగవంతుడిని స్మరించి ఉంటే మనకు మంచిబుద్ధి వచ్చి ఉండేది. మనం భగవంతుడికి ఎలా నమస్కరిస్తున్నామో, గురువుకు ఎలా నమస్కరిస్తున్నామో అలాగ మంచి కర్మకు కూడా

నమస్కారం పెట్టాలి. ఈనాటికైనా, ఏనాటికైనా మంచిపనులు చేసేవాడికి, వాడి బుద్ధి భగవంతుడి వైపుకు తిరుగుతుంది కాని చెడ్డపనులు చేసేవాడికి తిరగదు. మీకు ఏ ఆలోచనలు వచ్చినా, తలంపులు వచ్చినా దేహమే కారణం అవుతుంది. ఈ ప్రపంచం అంతా నేను అనుకొంటే మనకు అపకారం చేయదు. ఈ దేహమే నేను అనుకొంటే, ఏ నేను అయితే దేహానికి పరిమితం అయ్యి ఉందో అది మనకు అపకారం చేస్తుంది. తల్లితండ్రులను బాగా చూసినవారు ఎంతో కొంత ప్రజలను కూడా బాగా చూస్తారు. అసలు తల్లితండ్రులనే చూడని వారు ఇంక ప్రజలను ఏమి చూస్తారు. సమాజం మీద, దేశం మీద వారికి ఏమి ప్రేమ ఉంటుంది. భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు అని పరిపూర్ణమైన విశ్వాసం మనకు ఉంటే సాధనతో పని లేకుండా మనస్సు అణిగిపోతుంది. సాధనాసిద్ధులు, కృపాసిద్ధులు అని రామకృష్ణుడు చెప్పేవారు. కొంతమంది కష్టపడి, కష్టపడి సాధన చేసి సిద్ధిని పొందుతారు, వారు సాధనాసిద్ధులు. కొంతమందికి భగవంతుడి కృప వలన జ్ఞానం వచ్చేస్తుంది. మనం లోకం సత్యం, భగవంతుడు అసత్యం అనుకొంటాము. కృపాసిద్ధులు లోకం అసత్యం, భగవంతుడు మాత్రమే సత్యం అనుకొంటారు. వారు మనలాగే ఉంటారు, మనతో కలిసి తిరుగుతారు కాని ఇది అంతా అసత్యం అనుకొంటారు. మీరు పొగిడినా, విమర్శించినా ఇది అసత్యం అనుకొంటారు. వారు మోక్షం కావాలి అని ప్రత్యేకంగా సాధన చేయరు. నేను సత్యం, లోకం అసత్యం అని వీడు అనుకొంటున్నాడు అని ఏమీ సాధన లేకుండానే భగవంతుడు వాడికి మోక్షం ఇచ్చేస్తాడు. వారు కృపాసిద్ధులు, రమణమహర్షి అటువంటి వారే. మనం కూడా భక్తులమే కాని, ఈ ప్రపంచం సత్యం అన్నంత గట్టిగా దేవుడు సత్యం అనే భావన మనకు లేదు. కొంతమంది గొప్పలు కోరుకోరు, గౌరవాలు కోరుకోరు, ప్రశాంతంగా ఉంటారు, నిర్మలంగా ఉంటారు, నిరాడంబరంగా ఉంటారు, నిర్వికారంగా ఉంటారు. ఈ లోకం అసత్యం అనుకొంటారు. అసలు ఈ లోకం మీద నమ్మకం లేనప్పుడు లోకం మెచ్చుకోవాలనే బుద్ధి వారికి ఉండదు. భగవంతుడి దయ వలన వారికి మోక్షం వచ్చేస్తుంది. మనం అటు, ఇటు కాకుండా ఉన్నాము. మనం కష్టపడి సాధన చేయటం లేదు. భగవంతుడి మీద పరిపూర్ణమైన విశ్వాసం లేదు. శరీరంలో ఎముకలు, రక్తం, మాంసం, మలం ఉంటాయి. మనస్సులో కోరికలు, కోపాలు, తాపాలు, విసుగు అన్నీ ఉంటాయి. శరీరం అంతా ఎముకల గూడు, మనస్సు అంతా దరిద్రం. ఈ శరీరంతోటి, మనస్సుతోటి ఈ చండాలంతో లోపలఉన్న పురుషుడిని పోలుస్తారా అంటున్నారు ఆచార్యులవారు. ఎంత అపచారం, ఇంతకంటే అపచారం ఇంకేమి ఉంది. మీరు టెన్షన్‌లు పెట్టుకోవద్దు, ఈ

వ్యవహారం అంతా అసత్యమే, ఇది అంతా స్వప్న సమానమే.

హృదయంలో ఒక సత్యవస్తువు ఉంది, దానికి మరణం లేదు అని రమణభగవాన్‌కు అప్పడు తెలియదు, ఒక్కసారిగా మరణం వచ్చి దేహం మీద పడింది, దేహం మరణించింది, మరి నేను చనిపోవాలి కదా, నేను చావులేకుండా ఉన్నాను ఏమిటి అనుకొన్నాడు. దేహంతో తాదాత్మ్యం పొందే అసత్యమైననేనులో నుండి సత్యమైననేనులోనికి ఈశ్వరుడు ఒక్కసారిగా జంప్ చేయించాడు. దేహగతమైన నేను పోయింది, దేహంలేని నేను, మరణంలేని నేను వ్యక్తమయ్యింది. గురువు అయిపోయాడు, దేవుడు అయిపోయాడు. 10 నిమిషాలలో అంతా అయిపోయింది. ఎందుచేత అక్కడ ముగ్గిపోయి ఉన్నాడు, అర్హత యోగ్యత వచ్చింది, దేవుడు కరుణించాడు. వాడే కృపాసిద్ధుడు, నిజమైన నేను అనుభవంలోనికి వచ్చినవాడు ఏమి చేసినా, చేయని వాడితో సమానము. రేడియో పాడుతుంది అని రేడియో బద్దలు కొడితే అక్కడ పాడేవాడు కనబడడు, అది ఎక్కడ నుండో వస్తోంది. అలాగే నిజమైన నేను అనుభవంలోనికి వచ్చినవాడు భగవంతుడు ఏమి చేయిస్తే అది చేస్తాడు అంతేగాని అక్కడ వ్యక్తి కనబడడు. జ్ఞాని ఏపని చేసినా ఇతరుల కోసమే చేస్తాడు. రామకృష్ణపరమహంస దగ్గర లడ్డూకాని, ఏదైనా తినేది ఉంటే వివేకానందుడిని పిలిచి ఆయనే తినిపించేవాడు. ఎందుకు తినిపిస్తున్నాను అంటే నాకోసం కాదు, భవిష్యత్తులో ఇతరులకు చాలామందికి ఉపయోగపడతాడు అందుకు తినిపిస్తున్నాను అని చెప్పారు. తల్లితండ్రులలాగా అని అక్కడ కూర్చొన్నవాడు అన్నాడు. ఏమన్నావు నువ్వు? తల్లితండ్రులకు స్వార్థం ఉంటుంది, నేను స్వార్థంతో ఈ లడ్డు పెడుతున్నానా? నన్ను తల్లితండ్రులతో పోలుస్తావా అన్నారు. ఆయన సిద్ధ పురుషుడు, వివేకానందుడు ఆయనను ఉద్ధరించేది ఏముంది?

సాధన చేసేటప్పడు నీకు ఎప్పడైనా శాంతిగా ఉండవచ్చు, నీవు అనుకొన్న కోరికలు నెరవేరవచ్చు, మహిమలు సిద్ధులు రావచ్చు. అక్కడితో ఆగిపోవద్దు. ఇంకా లోపలకు వెళ్ళాలి. ఆత్మ నీ హృదయంలో ఎంత లోతులలో ఉందో మనస్సు అక్కడకు వెళ్ళాలి. చైతన్యానుభవం కలిగేవరకు నీవు లోపలకు వెళ్ళాలి. నీ సాధన వలన అది తెలియదు, దాని దయ వలన అది తెలియబడుతుంది. జ్ఞాని పని చేసినా చేయనివాడితో సమానము. ఎందుచేతనంటే అక్కడ కర్తృత్వం లేదు. సాధన చేసేటప్పడు ఒకోసారి భయం వస్తోంది అని భగవాన్‌ను అడిగితే భయం వస్తే రానియ్యి, నీవు కంగారు పడవద్దు, భయం చనిపోయే నేనుకే వస్తోంది. చూచేవాడు, చూడబడేది, చూడటం ఈ మూడూ నశించాలి. చూచేవాడు అహంకారం, చూడబడేది ప్రపంచం, చూడటం క్రియ. ఇవి మూడూ నశిస్తేగాని ఆత్మ నీకు గోచరం

కాదు. నీకంటే వేరుగా దేనినైనా చూసినప్పుడు కదా భయం. ద్వైతబుద్ధి ఉన్నప్పుడు నీకు భయం వేస్తుంది, అది నశించినప్పుడు నీకు భయం లేదు. ఈ భయం ఎవరికి అని ప్రశ్నించు. ఏదో ఊహించుకొని భయపడుతూ ఉంటారు. పూర్తిగా భగవంతుడి మీద భారం వేసినవాడికి భయం ఏమిటి? భయం వలన అశాంతి వస్తుంది, రాత్రి నిద్రపట్టదు, జ్ఞాపక శక్తి తగ్గిపోతుంది. దేహము నేను అనే తలంపులో నుండే కోరిక, కోపము, భయం ఇవి అన్నీ వస్తున్నాయి. నాకు దేహం లేదు అనుకోండి, దేహంలేనివాడికి ఇష్టం ఏమిటి? అయిష్టం ఏమిటి? మనం చేసేపొరపాటు ఏమిటి అంటే మనం కాని దేహంతోటి, మనం కాని డబ్బుతోటి, మనం కాని చదువుతోటి ఇలా మనం కానిదానితో తాదాత్మ్యం పొందుతున్నాము. ఇలా మనం కానిదానిలో తాదాత్మ్యం పొందటం వలన బతికిఉండగా దుఃఖం, చనిపోయిన తరువాత చీకటిలోకాలు మిగులుతాయి.

ఈ లోకంలో అత్యంత నీచమైనది భయం. రోజూ ఎంతమందికి భయపడతాము. భయం పెరిగేకొలది చనిపోయేనేను పెరిగిపోతూ ఉంటుంది. ఈ భయం ఏ నేనుకు వస్తోంది? ఈ నేను ఎవరు అని ప్రశ్నించుకొంటే అది లోపలకు వెళుతుంది. భయం కూడా ఒక తలంపు. దేహము నేను అనేది ఒక తలంపు. ఇది మొదటితలంపు. ఈ తలంపుకు ఇంకో తలంపు వస్తోంది. ఈ మొదటితలంపును లోపలకు ఉపసంహరించుకొంటూ వెళితే భయం కూడా పోతుంది. భయం దేహానికి రాదు, దేహము నేను అనే బుద్ధికి భయం వస్తోంది, అది నువ్వు కాదు. అందులో నుండి విడుదలపొందితే భయం లేదు. చావులేని వస్తువును తెలుసుకొనేవరకు నీకు ఏదో రకమైన భయం వస్తూనే ఉంటుంది. తాడు నీకు పాముగా కనిపిస్తున్నంతకాలం ఏదో రకమైన భయం వస్తూనే ఉంటుంది. అది పాము కాదు, అది తాడే అని నీకు తెలిసినప్పుడు ఇంక భయం లేదు. బ్రహ్మమే నీకు లోకంగా కనబడుతోంది. ఏ బ్రహ్మం అయితే లోకంగా వ్యక్తమవుతోందో అది నీకు అనుభవంలోనికి వచ్చినప్పుడు ఇంక లోకం కనబడదు, అంతా బ్రహ్మమే కనబడుతుంది, ఆ బ్రహ్మం నీవు అయి ఉన్నావు. రెండు ఉంటే భయం కాని, నిన్ను చూసి నీకు భయం ఏమిటి?

పూర్వం ఒక భక్తుడు 100 సంవత్సరాలు జీవించాడు. ఇంకో వందసంవత్సరాలు ఆయువు ఇస్తాను తీసుకొంటావా అని బ్రహ్మదేవుడు అడిగాడు. మీరు ఇస్తాను అంటే తీసుకొంటాను అన్నాడు. ఈ వందసంవత్సరాలు ఏమి చేస్తావు అని బ్రహ్మ అడిగాడు. ఇప్పుడు వంద సంవత్సరాలు బతికాను, ఏదో తపస్సు చేసుకొంటున్నాను, దేహబుద్ధి ఇంకా పోలేదు,

పరమేశ్వరుని యందు నిష్ట పూర్తిగా కుదరలేదు. అసలు ప్రయత్నం చేయటం లేదా అంటే చేస్తున్నాను ఈ లోపు 100 సంవత్సరాలు పూర్తి అయిపోయినాయి. మీరు ఇంకో 100 సంవత్సరాలు ఇస్తానంటున్నారు, మీరు ఇస్తే నేను వద్దనను, తీసుకొంటాను ఎందుకంటే నాకు దేహబుద్ధి ఇంకా పోలేదు. ఇప్పడు నేను చేస్తున్న ప్రయత్నం ఇంకా పెంచి, భగవంతుని యందు భక్తి పెంచుకొని ఆయనలో ఐక్యం అవ్వటానికి కృషి చేస్తాను అని చెప్పాడు. మనకు 100 సంవత్సరాలు ఆయుర్ధాయం భగవంతుడు ఇస్తే గౌరవాలు, ప్రతిష్ఠ, ధనం పెంచుకోవటానికి ఆ టైము అంతా వేష్ట చేస్తాము, ఇలా జీవితం అంతా వృధా చేస్తాము, చివరకు సున్న. దానం ఇచ్చేవారు కూడా గొప్పలకోసం ఇవ్వకూడదు, భగవంతుని ప్రీత్యర్థం చేయాలి. దానాలు ఇచ్చేవారు చాలామంది గౌరవం కోసం చేస్తారు. పదిమంది ఉండగా అడిగితే పదిరూపాయలు ఇస్తారు, అదే ఎవరు లేనప్పడు అడిగితే పైసా కూడా ఇవ్వరు, తిట్టి పంపిస్తారు. అది దానం కాదు, అది ఖర్మ అన్నాడు భగవంతుడు. రామకృష్ణుడి దగ్గర ఒక ధనవంతుడు కూర్చొన్నాడు, ప్రక్కనే ఒక బీదవాడు కూర్చొన్నాడు. ధనవంతుడితో రామకృష్ణుడు ఏమన్నాడు అంటే నీ జేబులో ఒక రూపాయి తీసి ఆ బీదవాడికి ఇయ్యి అని చెప్పాడు, అలాగే ఇస్తాను అని చెప్పాడు. ఎందుకు ఇమ్మంటున్నాను అంటే నీ సంపాదన యజ్ఞం అవుతుందని, నీవు ధన్యుడవు అవుతావని, నీవు పవిత్రుడవు అవుతావని ఇమ్మంటున్నాను అంతేగాని నీ రూపాయితో వాడు ఉద్ధరింపబడిపోడు, నీ రూపాయితో వాడి సంసారం వెళ్లిపోతుందా అన్నాడు రామకృష్ణుడు. ఫల్కీవాలా గొప్ప ప్లీడరు, ఆయన చాలా ధనం సంపాదించాడు. ఆ డబ్బు అంతా సమాజం కోసం ఖర్చు పెట్టాడు, చాలా మంచి పనులుచేసాడు. చివరిరోజులలో ఆయన మంచం పట్టాడు. ఆయనను చూడటానికి వచ్చిన బంధువులు, స్నేహితులు మీరు చాలా తెలివైనవారు, చాలా డబ్బు సంపాదించారు, చాలా మంచిపనులు చేసారు అనేవారు. ఫల్కీవాలా వారితో ఏమని చెప్పేవారు అంటే నేను చదువుకొన్న చదువు మీదకాని, నేను సంపాదించిన ధనం గురించి కాని, నేను చేసిన దానాలు గురించి కాని వాటి మీద నాకు ధ్యాస లేదు. నేను భగవంతుడిలో ఐక్యంఅవ్వటానికి ప్రయత్నం చేసుకొంటున్నాను. నాకు ఇప్పడు కావలసింది భగవంతుడి రూపం, నామం, ఇప్పడు నేను ఆ ధ్యాసలో ఉన్నాను. నేను మర్చిపోవటానికి ప్రయత్నం చేసే వాటిని గుర్తుచేసి మీరు నాకు అపకారం చేస్తున్నారు. లేనిపోని విషయాలు నాకు జ్ఞాపకం తెచ్చి నన్ను బంధంలో పడేయకండి అని వారి చేయి పట్టుకొని చెప్పేవాడు. భగవంతుడిలో ఐక్యం అవ్వటానికి ప్రయత్నం చేస్తూ ఉంటే అక్కరలేని గొడవలు ఏమిటి? నా డబ్బు నన్ను రక్షిస్తుందా? నా చదువులు నన్ను రక్షిస్తాయా? నన్ను

రక్షించేవాడు భగవంతుడు ఒక్కడే. చదువు పొట్టకోసం అనుకొంటారు. సంపాదన కోసం అనుకొంటారు, అది లోకసహజం. చదువు కేవలం పొట్టకోసం కాదు, పొట్ట పోషణతోపాటు ఏ చదువు అయితే మనస్సును పవిత్రం చేస్తుందో అది కదా నిజమైనచదువు అంటాడు ఫల్కీవాలా. కేవలం అన్నం పెట్టేది చదువా? అది మన మనస్సుకు పవిత్రత తీసుకొని రావాలి, ఏకాగ్రత తీసుకొని రావాలి. ఆయన డబ్బు సంపాదించి, డబ్బును జయించి, డబ్బును వదిలిపెట్టాడు, వాడు ఫల్కీవాలా.

ఒకసారి రామకృష్ణుడి దగ్గర నలుగురు, ఐదుగురు కూర్చొన్నారు. నరేన్ అక్కడికి వచ్చాడు. దేవుడు ఉన్నాడా? లేడా? అని అతనికి అనుమానం. కృష్ణుడు భగవంతుడై భగవద్గీత చెప్పాడు అని ఒకరు రామకష్ణుడితో చెపుతున్నారు. కృష్ణుడు దేవుడు అని ఎలా చెప్పగలం, కృష్ణుడే గీత చెప్పాడని ఎలా చెప్పగలం అని నరేన్ అన్నాడు. వీడు లోకాన్ని ఉద్ధరిస్తాడు అనుకొంటున్నాను, వీడి నోటి వెంట ఇలాంటి చెడు మాటలు వస్తున్నాయి ఏమిటి? నా మీద నాకు ఉన్న నమ్మకం, నాకు భగవంతుడు మీద ఉన్న నమ్మకం చెడగొట్టేటట్లుగా ఉన్నాడు అని రామకృష్ణుడు అనుకొంటూ కాళికాదేవి ఆలయానికి వెళ్ళాడు. నీవు కంగారు పడవద్దు, వాడిలో మార్పు స్లోగా వస్తుంది, నీవు అనుకొన్నట్లుగా వాడిద్వారా జరుగుతుంది అని కాళికాదేవి రామకృష్ణుడికి చెపుతుంది. రామకృష్ణానంద ఒకసారి 400 రు॥ తీసుకొని వచ్చి కలకత్తాలో వివేకానందకు ఇస్తారు. మఠం అభివృద్ధి చేయటానికి నీవు మద్రాసులో ఎంత కష్టపడుతున్నావో నాకు తెలుసు. ఇంకా ఈ 400 రూ॥ తెచ్చి నాకు ఇస్తావా అని రామకృష్ణానందకు తిరిగి ఇచ్చేయబోతాడు, ఆయన తీసుకోవటానికి ఇష్టపడడు. నేను వాడుకోవటానికి ఇష్టపడటం లేదు, ఆయన తిరిగి తీసుకోవటానికి ఇష్టపడటం లేదు అని అక్కడ శిష్యులతో చెపుతూ ఈ 400 రూ॥ మీ దగ్గర జాగ్రత్త పెట్టండి, నా శరీరం చనిపోయిన తరువాత రామకృష్ణానంద కుటుంబసభ్యులకు స్వామీజీ ఇచ్చారు అని ఇవ్వండి అని వివేకానంద చెప్పారు. చిన్న మానవహృదయంలో ఇంత ప్రేమ ఎలా దాచుకొన్నాడు అని స్వామీజీ గురించి అనేవారు. అనుకొన్న పనులు అన్నీ అయిపోతూ ఉంటే ఇది అంతా నిజం అనుకొని ప్రపంచంలో కలిసిపోకు. ద్వైతబుద్ధి నశించేవరకు కోపాలు, ఉద్రేకాలు, రోగాలు, ద్వేషాలు వస్తూనే ఉంటాయి. ఈ గొడవలు ఏమీ పట్టించుకోవద్దు. నీ లోపల ఉన్న చావులేని వస్తువును తెలుసుకొనే వరకు నీ ప్రయాణం ఆపవద్దు.

వయస్సు వచ్చి మీద పడుతోంది. జీవితం అనేక పాఠాలు నేర్పింది, ఇంక లోకానికి దూరమవుతున్నాను, స్మశానానికి దగ్గర అవుతున్నాను, జీవితంలో సాయంత్ర సమయం

వచ్చేసింది. భక్తిమార్గం, కర్మమార్గం, జ్ఞానమార్గం, ధ్యానమార్గం గురించి భగవంతుడు చెప్పాడు. బాగా రుచిగా ఉండే మార్గం, మనకు సంతోషం కలిగించే మార్గం, నిదానంగా ఉండే మార్గం భక్తిమార్గం, అన్ని మార్గాలలోకి భక్తిమార్గం తేలిక అని నా మనస్సుకు అనిపిస్తోంది అన్నారు ఫల్కీవాలా. మీరు అనుకొన్న పనులు అయిపోతున్నట్లు స్వప్నంలో వచ్చినా మెలుకువ వచ్చాక సున్నా, జీవితం కూడా అటువంటిదే. పది రకాలు కూరలు వేసుకొని తిన్నట్లు మీకు స్వప్నం వచ్చింది అనుకోండి, మెలకువ వచ్చాక తినటానికి తిండి లేదు అనుకోండి. స్వప్నంలో బాగా తిన్నాము ఇప్పుడు తిండి లేకపోయినా పరవాలేదు అని అనుకొంటారా? అలా అనుకోరు. అలాగే మీరు బాహ్యజీవితంలో ఎంత గొప్పగా బతికినా మీకు ఆధ్యాత్మికబలం లేకపోతే తురీయం దగ్గరకు వచ్చేటప్పటికి సున్నా అయిపోతారు. మాకు రోజులు బాగా వెళ్ళిపోతున్నాయి అని అక్కడే ఆగిపోకండి, ఇవి ఏమీ నిజాలు కాదు. ప్రతీ మనిషి వాడి అహంకారాన్ని సంతృప్తి పరచుకోవటానికి బతుకుతాడు, ఇంక అహంకారం ఎలా పోతుంది. ఎవడైతే తన్ను తాను వదులుకొంటాడో వాడికి కదా స్వర్గరాజ్యం అంటాడు ఏసు. తప్పిపోయిన గొర్రెలను కూడా చూస్తూ ఉండండి, వాటిని వదిలేయకండి అన్నాడు ఏసు. కొంతమంది భగవంతుడి మార్గాన్ని వదిలేస్తున్నారు. మీరు వారిని వదలవద్దు, మీకు తెలిసిన మంచిమాటలు వారికి చెప్పి వారు కూడా బాగుపడటానికి సహకరించండి. మనం తప్పిపోయిన వారిని ఉద్ధరించటం మాట అటు ఉంచండి, బాగా ఉన్నవారిని చెడగొట్టకుండా ఉంటే సరిపోతుంది. జీవుడి దగ్గర ఒక చెడ్డ ఉంది. బయటగొడవలు తెలుసుకోమంటే అమెరికా వరకు వెళ్ళిపోతాడు. నీవు ఎక్కడినుంచి వచ్చావో తెలుసుకో అని అంటే వాడు తెలుసుకోడు. వాడు ఎక్కడనుంచి వచ్చాడో వాడు తెలుసుకొంటే వాడు ఇంక ఉండడు, అది వాడికి తెలుసుకాబట్టి ఆ ప్రయత్నం చేయడు. ఏ జన్మకు ఆ జన్మ బయట నొల్లుకొంటూ ఉంటాడు. రోడ్డు మీద ఉన్న దుమ్ము అంతా పోగుచేసుకోవటం, ఆ దుమ్మును గౌరవం అనుకొని సంతృప్తిపడటం, ఇలా తిరుగుతూ చనిపోతాడు, ఇదే మనం చేసేపని. ఒకసారి శివుడు, పార్వతి మాట్లాడుకొంటున్నారు. ఈ పని చేస్తే ఆ ఫలితం వస్తుంది, ఆ యజ్ఞం చేస్తే ఈ ఫలితం వస్తుంది అని శివుడు పార్వతితో చెపుతున్నాడు. మీరు ఇవి అన్నీ చెపుతున్నారు. అసలు మోక్షం ఎలాగ వస్తుంది అని పార్వతి అడిగింది. ఏదో పని చేయటం వలన మోక్షం రాదు కదా, అందుకు చెప్పటంలేదు అన్నాడు మరి దానికి ఉపాయం లేదా అని పార్వతి అడిగింది. ఒక ఉపాయం ఉంది. సత్పురుషులతో, సాధుపురుషులతో సహవాసాలు చేస్తే వస్తుంది అని శివుడు చెప్పాడు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 05-02-06 | ఆది | భీమవరం |
| 12-02-06 | ఆది | ముప్పర్తిపాడు, వయా అత్తిలి |
| 18-02-06 | శని | సఖినేటిపల్లి |
| 20-02-06 | సోమ | గణపవరం సాయిబాబా మందిరం |
| 26-02-06 | ఆది | చించినాడ |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**

# కర్తలేని కర్మ

మనము చేయు కర్మల యొక్క ఫలితం మూడు అంశములపై ఆధారపడి ఉంటుంది. అవి స్వప్రయత్నం, కాలపరిపక్వం, ఈశ్వర కటాక్షం. మన వంతు ఒక పనిని చిత్తశుద్ధితో చేసి, ఫలితం గురించి ఆసక్తి, ఆందోళన చెందకుండా సరియైన కాలం వచ్చేవరకు వేచియుండాలి. సాధన విషయంలో కూడా ఈ సూత్రమే వర్తిస్తుంది. ఇక మూడవ అంశము, అత్యంత కీలకము అయిన ఈశ్వరుని కృప ఎప్పడు నిరంతరంగా ఉండేదే! ఈశ్వర కృప సర్వవ్యాపకము, అనంతము. అట్టి చైతన్యమే, నేను కర్తననుకొనే మిధ్యాకర్తకు, ఆకర్త చేయు కర్మకు ఆధారమై యున్నది. వ్యక్తిభావనతో నేను కర్తననుకొన్నా, నిజమైన కర్త పరమాత్మయే! అహంకారమే నిజంగా కర్త అయితే మనము చేయు పని తాలూకు ఫలితాలు మనం కోరుకొన్నట్లుగానే రావాలి, కాని అట్లు జరుగుటలేదు. పరమాత్మ సర్వజ్ఞుడు, సర్వవ్యాపి, అనంతుడు కనుక మనము చేసే ప్రతి పనికి సాక్షిగా వుంటూ, నియంత్రిస్తూ వుంటాడు. ఈశ్వరాజ్ఞ లేకుండా ఒక గడ్డిపరక కూడా కదలదు. కర్మఫల ప్రదాత పరమాత్మే! కర్మలను రెండు విధములుగా చెయ్యవచ్చు. 1. నేను చేస్తున్నాననే అహంభావనతో, అట్టి కర్మలు జడకర్మలవుతాయి, పరిమిత ఫలితాలనిస్తాయి. 2. ఆత్మబుద్ధితో కర్మలు చెయ్యవచ్చు అట్టి కర్మలు కర్తలేని కర్మలవుతాయి, అనగా పరమాత్మ చేసేవే అవుతాయి. ఒక పనిని పై రెండు విధములలో ఏరకంగా చేస్తున్నామన్నదే మన సాధనలో కీలకాంశం అవుతుంది.

**– చావలి సూర్యనారాయణమూర్తి,** ప్రధానోపాధ్యాయులు, అమలాపురం




ది॥ 28-11-05న పారిశ్రామిక జ్యోతి శ్రీ కె.వి.కె. రాజుగారి జయంతి మహోత్సవం పశ్చిమ గోదావరి జిల్లా పాతాళమెరకలో జరిగినది. కె.వి.కె. రాజు విద్యానికేతన్ ఆధ్వర్యంలో జరిగిన సభకు సద్గురు శ్రీ నాన్నగారు అధ్యక్షత వహించారు. స్టేట్ మార్కెటింగ్ యార్డు మనేజింగ్ డైరెక్టరు శ్రీ డి. రామకృష్ణగారు ముఖ్య అతిథిగా విచ్చేసి సభలో ప్రసంగించారు. శివవర్మగారు స్వాగతం చెప్పినారు.



కృష్ణా జిల్లా చిన్న తాడినాడ గ్రామంలో ది॥ 26-01-2006న సద్గురు శ్రీ నాన్నగారిని శ్రీ చేకూరి సుబ్బరాజుగారు, వారి ధర్మపత్ని సర్వజిని ఆహ్వానించి హారతి ఇస్తున్న దృశ్యం